





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 346 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 20 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :346 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 20 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## విపక్షాల ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు తేజం!

- ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ రెడ్డి
- ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా
- ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీ
- ఏకగ్రీవం చేయాలన్న అధికార పక్షం ఆశలకు గండి



వివరాలు 2లో..

## కోటాలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవే

పెన్ పవర్ డెస్క్: రాజస్థాన్‌లోని కోటా–బురిడీ లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోటా ఎయిర్‌పోర్ట్‌కు 440.06 హెక్టార్ల భూమి, రూ.1507 కోట్ల మంజూరుకు మంత్రి మండలి



వివరాలు 2లో..

## తాడిపత్రికి వీసా కావాలా?.. ప్రజలు అడ్డుకుంటే నా ఇల్లు రాసిస్తా

### జేసీపై కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫైర్

- తాడిపత్రిలోకి రాకుండా తనను అడ్డుకుంటున్నారన్న కేతిరెడ్డి
- పోలీసులను అడ్డుపెట్టుకుని జేసీ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణ
- అభివృద్ధిలో పోటీ పడాలంటూ జేసీ ప్రభాకర్ రెడ్డికి సవాల్



పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కాయి. తాడిపత్రికి వెళ్లాలంటే వీసా ఏమైనా తీసుకోవాలా? అని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని, తనను నియోజకవర్గంలోకి అడుగుపెట్టనీయకుండా చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనంతపురంలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... పోలీసుల అండతోనే జేసీ ప్రభాకర్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని, అధికారులు ఆయన చేతిలో బందీలుగా మారారని ఆరోపించారు. తాను ఎక్కడికి వెళ్లినా పోలీసులు తనను అనుసరిస్తున్నారని, తనపై ఆంక్షలు విధించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రిలో వైసీపీ నేతలపై జేసీ వర్గీయులు దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

రాజకీయ కక్ష సాధింపులు మానుకుని, దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడాలని జేసీకి సవాల్ విసిరారు. తాడిపత్రిలో

వివరాలు 2లో..

### ఆయనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని టీడీపీ, వైసీపీ, జనసేన, బీఆర్ఎస్ లను కోరుతున్నా

- ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- ఆయన ఎంపిక తెలుగు ప్రజలకు గర్వకారణమన్న వైఎస్ షర్మిల
- ఆయన ఏ పార్టీకి చెందినవారు కాదని, స్వతంత్ర నిపుణుడని వెల్లడి
- పార్టీలకతీతంగా సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని తెలుగు పార్టీలకు పిలుపు
- చంద్రబాబు, జగన్, పవన్ కళ్యాణ్, కేసీఆర్‌కు ప్రత్యేక విజ్ఞప్తి
- తెలుగు బిడ్డకు దక్కిన గౌరవాన్ని నిలబెట్టాలని సూచన



పెన్ పవర్ డెస్క్:ఇండియా కూటమి తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగువాడైన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో, వైఎస్ షర్మిల తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీలకు ఒక కీలక విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా ఆలోచించి, తెలుగు బిడ్డగా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు.ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు, వైసీపీ అధ్యక్షుడు జగన్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహకరించాలని మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేయడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని ఆమె అభివర్ణించారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి

వివరాలు 2లో..

# పీ4 కింద దత్తత.. స్వచ్ఛందమే

### నేనూ మార్గదర్శినే... 250 కుటుంబాల బాగోగులకు సమయం కేటాయిస్తా



- రాష్ట్రంలో పీ4 కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన ప్రభుత్వం
- పేదరికంపై ప్రజా భాగస్వామ్యంతో పోరాటమని స్పష్టం చేసిన సీఎం
- కుప్పంలో 250 పేద కుటుంబాలను వ్యక్తిగతంగా దత్తత తీసుకున్న చంద్రబాబు
- ప్రజల ఆరోగ్యం కోసం 'సంజీవని' పేరుతో సరికొత్త పథకం ప్రకటన
- సాయంతో పాటు పేద కుటుంబాలకు భరోసా ఇవ్వాలని మార్గదర్శులకు పిలుపు
- 13 లక్షలకు పైగా కుటుంబాలను దత్తత తీసుకున్న 1.41 లక్షల మంది మార్గదర్శులు



పెన్ పవర్ డెస్క్:"నేను కూడా ఒక మార్గదర్శినే. మాటలు చెప్పడమే కాదు, చేతల్లో చూపిస్తాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో 250 పేద కుటుంబాల బాధ్యతను వ్యక్తిగతంగా తీసుకుంటున్నానని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా తాను ఎంత బిజీగా ఉన్నప్పటికీ, దత్తత తీసుకున్న ఆ కుటుంబాల బాగోగుల కోసం కచ్చితంగా సమయం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన 'పీ4' (ప్రజలు–ప్రభుత్వం–ప్రైవేటు భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన) కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "పేదలకు సేవ చేసినప్పుడు కలిగే సంతృప్తి మరెందులోనూ రాదు. సమాజం ఇచ్చిన సహకారంతో పైకి వచ్చిన వారు, తిరిగి సమాజానికి సేవ చేయాలి. మార్గదర్శులు కేవలం డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకోకుండా, బంగారు కుటుంబాలకు అండగా నిలిచి భరోసా ఇవ్వాలి" అని పిలుపునిచ్చారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ సిద్ధాంతాన్ని తాము బలంగా నమ్ముతామని, కూటమి

వివరాలు 2లో..

## విష ప్రచారాలు ఆపాలి

### జగన్‌కు మంత్రి నారాయణ సూచన

- అమరావతి మునిగిపోతోందన్న విష ప్రచారాలను ఆపాలన్న నారాయణ
- కొండవీటి వాగుకు మట్టి అడ్డంగా వదిలేయడమే ప్రస్తుత పరిస్థితికి కాణమని వెల్లడి
- ఇలాగే చేస్తే ఉన్న 11 సీట్లు కూడా వైసీపీకి దక్కవని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని ఇకనైనా ఆపాలని రాష్ట్ర మంత్రి నారాయణ హితవు పలికారు. అమరావతి మునిగిపోతోందంటూ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఆయన, వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడవద్దని సూచించారు. కొండవీటి వాగు పరిసరాల్లో నీరు



వివరాలు 2లో..

## సింధు జలాల ఒప్పందం

### నెహ్రూపై మరోసారి విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

- సింధు జలాల ఒప్పందం నెహ్రూ చేసిన చారిత్రక తప్పిదం అన్న ప్రధాని మోదీ
- దేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారని తీవ్ర విమర్శలు
- ఒప్పందం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ
- మోదీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ప్రియాంక గాంధీ
- గతాన్ని వదిలి ప్రస్తుత సమస్యలపై మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్

పెన్ పవర్ డెస్క్:భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో నెహ్రూ



వివరాలు 2లో..

### చైనా సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయి..

## సంబంధాలు మెరుగుపడ్డాయి




- ఢిల్లీలో భేటీ అయిన భారత, చైనా ప్రత్యేక ప్రతినిధులు
- సరిహద్దుల్లో శాంతి నెలకొనడంపై ఇరు దేశాల హర్షం
- గత ఏడాది నుంచి సంబంధాలు మెరుగుపడ్డాయన్న అజిత్ దోవల్
- మోదీ-జిన్‌పింగ్ భేటీతో మార్గం సుగమమైందన్న చైనా మంత్రి వాంగ్ యీ
- త్వరలో చైనాలో జరగనున్న ఎస్‌సీఓ సదస్సుకు హాజరుకానున్న ప్రధాని మోదీ
- లడక్ ఘర్షణల అనంతరం సాధారణ స్థితికి చేరుకుంటున్న ద్వైపాక్షిక బంధం

పెన్ పవర్ డెస్క్:భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల దిశగా పయనిస్తున్నాయి. గత సంవత్సరం అక్టోబర్‌లో సరిహద్దుల్లో సైనిక ప్రతిష్టంభన ముగిసిన నాటి నుంచి ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొందని, దీనివల్ల రెండు దేశాలూ ప్రయోజనం పొందాయని జాతీయ భద్రతా

వివరాలు 2లో..

### మిమ్మల్ని ప్రాణంగా భావించే

## ఈ విజయ్ గురించి మీకు బాగా తెలుసు

- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై విజయ్ పూర్తి విశ్వాసం
- మన పార్టీదే అధికారమని కీలక ప్రకటన
- 1967, 1977 ఫలితాలు పునరావృతం అవుతాయని ధీమా



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ అధినేత, ప్రముఖ నటుడు విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేస్తుందని, ప్రజలతో మమేకమైన పార్టీగా నిరూపించుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.1967, 1977 సంవత్సరాల్లో వచ్చిన చరిత్రాత్మక ఎన్నికల ఫలితాలను 2026లో మళ్లీ చూడబోతున్నామని విజయ్ జోస్యం చెప్పారు. అపారమైన ప్రజాశక్తితో ఈ కలను తాము నిజం


వివరాలు 2లో..

### వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డే

## ప్రధాన సూత్రధారి

### సుప్రీంకోర్టులో సునీత న్యాయవాది వాదనలు

- అవినాశ్ బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ
- సుప్రీంకోర్టులో వాడివేడి వాదనలు
- డాక్టర్ సునీత, ఆమె భర్త, సీబీఐ మాజీ అధికారిపై నమోదైన కేసులు కొట్టివేత
- సాక్ష్యాల ధ్వంసం రుజువైందని, నిందితులకు మరణశిక్ష పడొచ్చని కోర్టుకు తెలిపిన సీబీఐ



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచా రణలో భాగంగా సుప్రీంకోర్టులో సంచలన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ హత్య వెనుక కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డే 'మాస్టర్ మైండ్' అని వివేకా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# జగన్ ఇప్పటికీ.. ఎప్పటికీ మిత్రుడే.. అదే కారణం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోకపోయినా పరోక్షంగా తన సంబంధాలను కొనసాగిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెడుతున్న ప్రతి బిల్లుకు వైసీపీ ఆమోదిస్తుంది. అలాగే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ మద్దతు ఇస్తూ వస్తుంది. అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు కూడా జగన్ బీజేపీతో సఖ్యతగానే ఉంటూ వస్తున్నారు. బీజేపీ కేంద్ర నాయకత్వానికి కూడా జగన్ పట్ల సానుకూల వైఖరి ఉందంటారు. మరొకవైపు కాంగ్రెస్ కు శత్రువు కావడంతో సహజంగానే తనకు మిత్రుడిగా జగన్ ను బీజేపీ భావిస్తుంది. అందుకే జగన్ పై నమోదయిన అనేక కేసులు నేటికీ ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ నేతలు కూడా బహిరంగంగానే ఆరోపిస్తారు.

### ఎన్నిక జరిగితే...

తాజాగా మరోసారి ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి. ఇండి కూటమి ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. ఈ నెల 21వ తేదీన నామినేషన్లకు తుది గడువు కావడంతో ఇండి కూటమి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దింపాలని ప్రయత్నిస్తుంది. అయితే వైసీపీకి రాజ్యసభలో ఏడుగురు, లోక్ సభలో నలుగురు సభ్యుల బలం ఉంది. మొత్తం పదకొండు మంది సభ్యులు ఉండటంతో జగన్ సహజంగానే ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఇప్పటికే కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఫోన్ చేసి జగన్ తో మాట్లాడారు. తమకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. తాను పార్టీ నేతలతో చర్చించిన తర్వాత నిర్ణయం చెబుతానని జగన్ చెప్పినప్పటికీ నిర్ణయం బీజేపీ వైపు ఉంటుందన్నది అందరికీ తెలిసిందే.

### రాహుల్ పై విమర్శలు

జగన్ ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా విమర్శలు చేశారు. చంద్రబాబు, రాహుల్ గాంధీ హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారంటూ ఆరోపించారు. అలాగే ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణికం ఠాగూర్ జగన్ పై చేసిన విమర్శలతో పాటు పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కూడా జగన్ కు శత్రువుగా మారడంతో ఆ పార్టీ పక్షాన నిలబడే అవకాశం ఎంత మాత్రం ఉండదు. అందుకే అందులోనూ ఎన్డీఏకు ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో గెలవగల బలం కూడా ఉంది. ఈ నేపథ్యంలో జగన్ బీజేపీని కాదని ఇండి కూటమి వైపు నిలబడే ఛాన్స్ లేదన్నది ఓపెన్ సీక్రెట్. కాకుంటే పార్టీ నేతల అభిప్రాయం తీసుకుని ప్రకటిస్తామని చెప్పడం మాత్రం కేవలం నామమాత్రమేనని అందరికీ తెలిసిందే.

### పదేళ్లకు ముందే...

2014కు ముందు పార్టీ పెట్టిన తర్వాత బీజేపీ నాయకత్వం నేరుగా జగన్ తో పొత్తు పెట్టుకోవాలని ప్రయత్నించిందన్న ప్రచారం అప్పట్లో బాగానే జరిగింది. అయితే జగన్ ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారు. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి వైసీపీ పార్టీ పెట్టడంతో పాటు తనను పదహారు నెలల పాటు జైలులో ఉంచారన్న కసి ఆయనలో ఇప్పటికీ ఉంది. అందుకే జగన్ నిర్ణయం బీజేపీకే అనుకూలంగా ఉండనుంది. ఏపీ రాజకీయాలను పరిశీలించిన వారికి ఎవరికైనాజగన్ బీజేపీకి మిత్రుడేనని చెబుతారు. రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ జగన్ మాత్రం కాంగ్రెస్ పార్టీ కి అనుకూలంగా ఉండే అవకాశమయితే అసాధ్యమన్నది వాస్తవం. అందువల్ల బీజేపీకి జగన్ ఇప్పుడే కాదు.. ఎప్పటికీ మిత్రుడేనని ఖచ్చితంగా చెప్పాలి.

# విపక్షాల ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు తేజం!

ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో విపక్షాల ఇండియా కూటమి తమ అభ్యర్థిని ఖరారు చేసింది. ఎవరూ ఊహించని విధంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, తెలంగాణకు చెందిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పేరును ఈరోజు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవం కావాలన్న అధికార పక్షం ప్రయత్నాలకు ప్రతిపక్షాలు గండికొట్టినట్టయింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయవ్యవస్థలో విశేషమైన అనుభవం ఉంది. ఆయన 2007 నుంచి 2011 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. ఆ తర్వాత గోవా లోకాయుక్తగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. న్యాయ వ్యవస్థలో ఉన్నత స్థాయిలో పనిచేసిన తెలుగు వ్యక్తిని ప్రతిపక్షాలు తమ అభ్యర్థిగా ఎంపిక చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే అధికార ఎన్డీయే కూటమి తమ అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన సీపీ రాధాకృష్ణన్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి బదులుగా ఇండియా కూటమి సైతం దక్షిణాది నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించుకుంది.

ఈ క్రమంలో అనూహ్యంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తెచ్చింది. దీంతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరు ఇద్దరు దక్షిణాది నేతల మధ్య ఆసక్తికరంగా మారింది. ఈ ఎంపిక ద్వారా ప్రతిపక్షాలు కేవలం పోటీ ఇవ్వడమే కాకుండా, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖుడిని బరిలోకి దించి వ్యూహాత్మకంగా వ్యవహరించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పీ4 కింద దత్తత.. స్వచ్ఛందమే

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం పేదల కోసమే ఉంటుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1,41,977 మంది మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 13,40,697 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారని ప్రభుత్వం వెల్లడించింది.

### ప్రజారోగ్య పరిరక్షణకు 'సంజీవని'

ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించి ముఖ్యమంత్రి ఒక కీలక ప్రకటన చేశారు. ప్రపంచ ప్రఖ్యాత 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' సహకారంతో రాష్ట్రంలో 'సంజీవని' పేరుతో ఒక బృహత్తర ఆరోగ్య పథకాన్ని తీసుకురానున్నట్లు వెల్లడించారు. "ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ ప్రాధాన్యత. ఇప్పటికే కుప్పంలో గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి డిజీ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాకు, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

### సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

ఈ నెలలో ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించామని, పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేశామని సీఎం గుర్తుచేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని, విజన్ 2047 లక్ష్యంగా

రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ఎన్నార్టీ ఛైర్మన్ వేమూరి రవికుమార్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సౌదీ అరేబియాలో ఉన్న ఎన్నారైలు కూడా జూమ్ ద్వారా పాల్గొని పలు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారు.

# ఆయనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని టీడీపీ, వైసీపీ, జనసేన, బీఆర్ఎస్ లను కోరుతున్నా

- మొదటి పేజీ తరువాయి

ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి కాదని, ఆయన ఒక స్వతంత్ర నిపుణుడని షర్మిల స్పష్టం చేశారు. "ఆయన కాంగ్రెస్ పార్టీ సభ్యుడు కాదు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు న్యాయ రంగంలో విశేష అనుభవం ఉంది. ఆయన ఎంపికను రాజకీయ కోణంలో చూడవద్దు" అని ఆమె అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే జస్టిస్ సుదర్శన్ రెడ్డి వంటి నిష్పక్షపాత న్యాయ నిపుణులు ఉన్నత పదవుల్లో ఉండటం అవసరమని ఇండియా కూటమి భావిస్తోందని ఆమె పేర్కొన్నారు. పార్టీల మధ్య ఉన్న రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, తెలుగు వ్యక్తికి దక్కిన ఈ గౌరవాన్ని నిలబెట్టేందుకు అందరూ కలిసి రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తెలుగువారి ఐక్యతను చాటాలని షర్మిల సూచించారు.

# సింధు జలాల ఒప్పందం

- మొదటి పేజీ తరువాయి

చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారని, తద్వారా దేశ రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. మంగళవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ లైబ్రరీ భవనంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ మాట్లాడుతూ, "నెహ్రూ దేశాన్ని ఒకసారి కాదు, రెండుసార్లు విభజించారు. మొదట రాడ్‌క్లిఫ్ లైన్‌తో, ఆ తర్వాత సింధు జలాల ఒప్పందంతో దేశానికి నష్టం చేకూర్చారు" అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కింద సింధు నది జలాల్లో 80 శాతం నీటిని పాకిస్థాన్‌కు ధారాదత్తం చేశారని ఆయన మండిపడ్డారు. ఆ తర్వాత తన కార్యదర్శి వద్ద ఈ ఒప్పందం వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదని నెహ్రూ స్వయంగా తన తప్పును అంగీకరించారని మోదీ తెలిపారు. ఈ ఒప్పందం పూర్తిగా రైతు వ్యతిరేకమని ఆయన అభివర్ణించారు.రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోదీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచారని విమర్శించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే వారి అభివృద్ధి మొదలైందని అన్నారు. ఎన్డీయే హయాంలో దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.

### నెహ్రూను నిందించడం అలవాటుగా మారింది: ప్రియాంక

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే పదేపదే నెహ్రూను నిందిస్తోందని ఆమె విమర్శించారు. "గతాన్ని పదేపదే తవ్వడం మానేసి, వర్తమానంలో జరుగుతున్న విషయాలపై సమాధానం చెప్పాలి. ఓట్ల దొంగతనం ఆరోపణలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రజలకు జవాబుదారీగా ఉండాలి" అని పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రియాంక డిమాండ్ చేశారు.

# తాడిపత్రికి వీసా కావాలా?.. ప్రజలు అడ్డుకుంటే నా ఇల్లు రాసిస్తా

- మొదటి పేజీ తరువాయి

జరుగుతున్న అరాచకాలపై సిట్ తో విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విచారణ జరిగితే తాడిపత్రిలో ఎవరు దౌర్జన్యాలు చేస్తున్నారో, ఎవరు అరాచకాలు సృష్టిస్తున్నారో తేలిపోతుందని స్పష్టం చేశారు. తాడిపత్రి ప్రజలు తనను వ్యతిరేకించడం లేదని, గత ఎన్నికల్లో తనకు 80 వేల ఓట్లు వచ్చాయని కేతిరెడ్డి గుర్తుచేశారు. ప్రజలు కనుక తనను నిజంగా అడ్డుకుంటే, తన ఇల్లు రాసిస్తానని, కానీ పోలీసుల సాయంతో టీడీపీ నేతలే ఈ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జేసీ వర్గీయులు ప్రజల నుంచి అక్రమ వసూళ్లు మానుకోవాలని హితవు పలికారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ తనను తాడిపత్రిలోకి అనుమతించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# విష ప్రచారాలు ఆపాలి

- మొదటి పేజీ తరువాయి

నిలిచిపోయిన నీరుకొండ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి, సమస్యకు గల కారణాలను మీడియాకు వివరించారు.పశ్చిమ బైపాస్ రహదారిపై వంతెన నిర్మాణ సమయంలో తొలగించిన మట్టిని వాగు ప్రవాహానికి అడ్డంగా వదిలేయడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని మంత్రి స్పష్టం చేశారు. "నిర్మాణ పనులు జరిగేటప్పుడు వర్షం పడితే గుంతల్లోకి నీళ్లు చేరడం సహజం. అంతమాత్రానికే ఐకానిక్ భవనాలు మునిగిపోయాయని ప్రచారం చేయడం సరికాదు" అని అన్నారు. కేవలం రెండు గ్రామాల పరిధిలోని పొలాల్లోకి మాత్రమే నీరు చేరిందని, మిగిలిన గ్రామాల్లో వర్షం పడిన కొద్ది గంటల్లోనే నీరు వెళ్లిపోయిందని తెలిపారు. కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకంగా ఉన్న మట్టిని తక్షణమే తొలగించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు.వైసీపీ నేతలు ఇలాగే విష ప్రచారాలు కొనసాగిస్తే, వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు గెలిచిన 11 స్థానాలు కూడా దక్కవని నారాయణ హెచ్చరించారు. "రాజధాని మునిగిపోతుందని ఆరోపించే వారు ఇక్కడికి వచ్చి వాస్తవ పరిస్థితిని చూడాలి. నోటికి వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు" అని ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

# కోటాలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజీ తరువాయి

ఆమోదం తెలిపింది. అలాగే.. ఒడిశాలో కటక్-భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. రూ.8307 కోట్ల వ్యయంతో భువనేశ్వర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం (ఆగస్ట్ 19) డిల్లీలో కేంద్ర కేబినెట్ భేటీ అయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రాజస్థాన్?లోని కోటా-బుందీలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, ఒడిశాలో కటక్-భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. కోట-బుంది గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని రూ.1507.00 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయడానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. భారీగా పెరిగిన వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి ఒడిశాలో కటక్-భువనేశ్వర్ మధ్య 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ అప్రూవల్ తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్ట్ కటక్, భువనేశ్వర్, ఖోర్ధా నగరాల నుండి ట్రాఫిక్‌ను మళ్లించడం ద్వారా ఒడిశా, ఇతర తూర్పు రాష్ట్రాలకు గణనీయమైన ప్రయోజనాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ సరుకు రవాణా సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని.. అలాగే ఈ ప్రాంతంలో సామాజిక-ఆర్థిక వృద్ధిని పెంచుతుందని పేర్కొన్నారు.

# వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డే ప్రధాన సూత్రధారి

- మొదటి పేజీ తరువాయి

కుమార్తె డాక్టర్ సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ధర్మాసనం ముందు తీవ్ర ఆరోపణలు చేశారు. అవినాశ్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వాడివేడి వాదనలు జరిగాయి.విచారణ సందర్భంగా సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ.. నిందితులు సాక్షులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారని, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కుట్రలో భాగంగానే డాక్టర్ సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి, సీబీఐ మాజీ ఎస్పీ రామ్ సింగ్‌లపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని, అప్పుడే అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటకు వస్తారని ఆయన వాదించారు.మరోవైపు, సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో సాక్ష్యాల ధ్వంసం జరిగిందని దర్యాప్తులో స్పష్టంగా నిరూపితమైందని తెలిపారు. మొదట గుండెపోటు అని, ఆ తర్వాత రక్తపు వాంతులని ప్రచారం చేసి హత్యను కప్పిపుచ్చేందుకు అన్ని విధాలా ప్రయత్నించారని వివరించారు. ఈ నేరం తీవ్రతను బట్టి నిందితులకు మరణశిక్ష విధించే అవకాశం కూ డా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తరఫు న్యాయవాది అహ్మదీ వాదిస్తూ.. నిందితుడు శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి, మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లి అప్రూవర్‌గా మారిన దస్తగిరిని బెదిరించారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కోర్టుకు తెలిపారు.అన్ని వర్గాల వాదనలు విన్న ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ డాక్టర్ సునీత, ఆమె భర్త, రామ్ సింగ్‌పై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. అనంతరం, ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా, నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలా అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. ఎంతమంది నిందితుల బెయిల్ రద్దు చేయాలో కూడా తెలియజేయాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే నెల 9వ తేదీకి వాయిదా వేసింది.

# మిమ్మల్ని ప్రాణంగా భావించే ఈ విజయ్ గురించి మీకు బాగా తెలుసు

- మొదటి పేజీ తరువాయి

చేయబోతున్నామని పేర్కొన్నారు. "తమిళ ప్రజలను ప్రాణానికి ప్రాణంగా భావించే ఈ విజయ్ గురించి మీకు బాగా తెలుసు. మన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇక కొన్ని నెలల సమయం మాత్రమే ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.పార్టీ విజయం కోసం అభిమానులు, యువత, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ఏకైక ధ్యేయంగా మనస్సాక్షి ఉన్న ప్రజాపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారమే లక్ష్యంగా ముందుకు సాగి, తమిళ గడ్డపై సరికొత్త ఫలితాన్ని కచ్చితంగా చూపిస్తామని అన్నారు. ఎన్నికలు అనే రాజకీయ యుద్ధంలో గెలుస్తామని, అంతా మంచే జరుగుతుందని, విజయం తథ్యమని విజయ్ తన ప్రకటనలో పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# చైనా సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయి.. సంబంధాలు మెరుగుపడ్డాయి

- మొదటి పేజీ తరువాయి

సలహాదారు అజిత్ దోవల్ పేర్కొన్నారు. సరిహద్దు వివాదంపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ఆయన మంగళవారం ప్రత్యేక ప్రతినిధుల స్థాయిలో 24వ విడత చర్చలు జరిపారు.ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటనకు కొన్ని రోజుల ముందు ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. చైనాలోని టియాన్జిన్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (%యాజూ%) శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోదీ హాజరుకానున్నారని దోవల్ ఈ సందర్భంగా ధృవీకరించారు. ఈ నేపథ్యంలో ఈ చర్చలు చాలా కీలకమైనవని ఆయన పేర్కొన్నారు.గత తొమ్మిది నెలలుగా భారత్-చైనా సంబంధాలు మెరుగుపడుతున్నాయని అజిత్ దోవల్ తెలిపారు. "సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయి. శాంతి, సామరస్యం నెలకొన్నాయి. మన ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడ్డాయి. గత ఏడాది అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ భేటీ తర్వాత ఈ కొత్త వాతావరణం ఏర్పడింది. అప్పటి నుంచి ఇరు దేశాలు ఎంతో లబ్ధి పొందాయి" అని దోవల్ వివరించారు.

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ఇరు దేశాల సంబంధాల్లో ఎదురైన ఆటుపోట్లు ఎవరికీ మంచివి కావని అన్నారు. గత ఏడాది మోదీ, జిన్‌పింగ్ భేటీ ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి సరైన దిశానిర్దేశం చేసిందని, సరిహద్దు సమస్య పరిష్కారానికి ఊతమిచ్చిందని తెలిపారు. "సరిహద్దుల్లో ఇప్పుడు నెలకొన్న స్థిరత్వం మాకు సంతోషాన్ని కలిగిస్తోంది. ప్రధాని మోదీ మా ఆహ్వానం మేరకు ఎస్‌సీఓ సదస్సు కోసం చైనాకు రానుండటాన్ని మేం ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.2020 ఏప్రిల్-మే నెలల్లో లడక్‌లోని వాస్తవాధీన రేఖ వద్ద మొదలైన సైనిక ప్రతిష్టంభన, ఆ తర్వాత గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల కారణంగా ఇరు దేశాల సంబంధాలు ఆరు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే. 2024 అక్టోబర్ 21న ప్రతిష్టంభనకు తెరపడటంతో, ఆ తర్వాత రెండు రోజులకే మోదీ-జిన్‌పింగ్ కజాన్‌లో సమావేశమై సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయించారు. తాజా చర్చల్లో సరిహద్దుల్లో నమ్మకాన్ని పెంచే చర్యలపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ పర్యటన ముగింపులో వాంగ్ యీ ప్రధాని మోదీతోనూ సమావేశం కానున్నారు.



## తిరుమలలో భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు నీటి నిల్వలు

### - అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి

**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 19 :** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 02వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటి నిల్వలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో అదనపు ఈవో తిరుమల, తిరుపతి ప్రాంతాలలోని అన్ని డ్యాములలో నీటి లభ్యత, వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా అదనపు ఈవో మాట్లాడుతూ, తిరుమలలోని డ్యాముల దృఢత్వంపై సమగ్ర నివేదిక అందించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత నీటి నిల్వలు 2025 డిసెంబర్ వరకు భక్తుల అవసరాలకు సరిపోతాయన్నారు. రాబోయే కార్తీక మాసంలో వర్షపాతం ఆధారంగా భవిష్యత్ అవసరాలకు సరిపడే విధంగా నీటిని వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. తిరుమలలో గోగర్భం, కుమారధార, పసుపుధార, పాపవినసనం, ఆకాశగంగ, తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ లలో ప్రస్తుతం భక్తుల అవసరాలకు తగిన నీటి నిల్వలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం పెంచుకోవడానికి అవకాశాలను పరిశీలించాలన్నారు. గత 5 నుండి 10 సంవత్సరాల వరకు నీటి లభ్యత, వర్షపాతం, వినియోగం, వృథా విడుదలపై నిపుణులచే సమగ్ర ఆడిట్ నిర్వహించాలన్నారు. నీటిని ప్రణాళికబద్ధంగా వినియోగించుకుంటే, నిరంతర సరఫరా సాధ్యమని చెప్పారు. తిరుమలలోని వాణిజ్య సంస్థల నీటి బకాయిలను సకాలంలో వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.




# నేషనల్ హైవే పరిధిలో రోడ్ల నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తి...

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 19 :** రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లమ్మ దేవాలయం దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్ కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు కు సంబంధించిన ప్రతిపాదనలను జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తీసుకుని ప్రభుత్వానికి పంపాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. అలాగే ఉల్చాల, గాయత్రి ఎస్టేట్ జంక్షన్ అభివృద్ధి పనులలో పురోగతి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కర్నూలు నగరం లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే మెయిన్ రోడ్‌లలో గుంతలు పూడ్చే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు... కిడ్స్ వరల్డ్ నుండి కలెక్టరేట్ రోడ్ విస్తరణ పనులకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల, బళ్ళారి చౌరస్తా, బిర్లా కాంపౌండ్, కలెక్టరేట్ సర్కిల్ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, ఆటోల వల్ల ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని, రద్దీని నియంత్రించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అలాగే రోడ్లపై చెత్త ఎక్కడంటే ఎక్కడ వేయకుండా పెద్ద పెద్ద డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసి, అందులో చెత్త వేసే విధంగా తగిన చర్యలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. బళ్ళారి చౌరస్తా నుండి బి క్యాంప్ వరకు ఉన్న డివైడర్ లకు ఆకర్షణీయంగా పెయింటింగ్ లు వేయించాలని, అదే విధంగా నగరంలో పారిశుధ్య కార్యక్రమాలు పక్కా గా జరిగే విధంగా 3 షిఫ్ట్ ల ప్రకారం 3 టీమ్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. నేషనల్ హైవే, కడప పరిధిలో 16 బ్లాక్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, ఈ పనులు నిదానంగా జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నేషనల్ హైవే, కడప పీడీ నీ ఆదేశించారు. ప్రమాదాల నివారణకు వీలుగా ఆర్ అండ్ బి ద్వారా జరిగే పనులకు డీఎంఎఫ్ నుండి నిధులు మంజూరు చేశామని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు... కొన్ని కొన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్లు అవసరానికి మించి చాలా ఎత్తుగా పెడుతున్నారని, జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నిబంధనల ప్రకారం ఎంత పెట్టాలో, అదే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు.. అదే విధంగా పంచాయతీ రాజ్ పరిధిలో ఉన్న రోడ్లు పూర్తిగా పాడై ఉన్నట్లయితే, వాటిని ఉపాధి హామీ కింద చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు.. జూలై మాసంలో జరిగిన ప్రమాదాల గురించి సమీక్షించారు.. ప్రమాదాలు జరిగిన చోట జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి, కమిటీ సూచనల మేరకు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఆలూరు నుండి కోడుమూరు రోడ్డు లో పెద్ద గుంతలు ఉన్నాయని, వాటిని పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఇన్స్టాల్ చేసిన సీసీ కెమెరాలలో కొన్ని కెమెరాలకు నిర్వహణ లేదని, నిర్వహణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు వీలుగా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు..రోడ్ సేఫ్టీ సమావేశంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మే, జూన్, జూలై నెలలో ప్రమాదాలు బాగానే తగ్గాయన్నారు.. ట్రాఫిక్ రూల్స్ కి సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించే విధంగా ముఖ్యమైన కూడలిలో వీడియో రూపంలో ప్రదర్శించేందుకు వాహనాన్ని అందచేయాలని ఎస్పీ కలెక్టర్‌ను కోరారు. సీ ఎస్ ఆర్ కింద వాహనం అందచేసే అవకాశాన్ని పరిశీలించాలని కలెక్టర్ నేషనల్ హైవే అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డిటిసి శాంత కుమారి, ఎన్ హెచ్ పిడి అశోక్ కుమార్, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి సింధు సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు..





## అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి





**బనగానపల్లి పెన్ పవర్ ఆగస్టు 19 :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను రాష్ట్ర రోడ్లు&భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. నేడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్య లను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహంచిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

### అమరావతి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో

# పవిత్రోత్సవాలు ప్రారంభం



**అమరావతి పెన్ పవర్ ఆగస్టు 19 :** అమరావతి (వేంకటపాలెం) శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళ వారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలలో పంచగ వ్యారాధన, అకల్మష హెూమం, వాస్తు పూజ, వాస్తు హెూమం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ట, అధివాసం, సర్వదైవత్య హెూమం చేపడుతారు. ఆగష్టు 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హెూమములు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణము, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హెూమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఆగష్టు 21వ తేదీన ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమములు, స్నపన తిరుమం జనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహు మానం, యాజమాన ఆశీర్వాచనం చేపడు తారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, సందీప్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



### రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభానికి

# అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 19 :** ఈనెల 20వతేదీన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించడం జరుగుతుందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్న అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 20వతేదీన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించడం జరుగుతుంద న్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

అనంతపురం జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ నుంచి ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, తదితరులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం కోసం అన్ని రకాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఆవిష్కరణ, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, ఉపాధి సృష్టిని ప్రోత్సహించే లక్ష్యంతో, సిలికాన్ వ్యాలీ తరహా ఇకోసిస్టమ్‌ను సృష్టించడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేస్తున్నార న్నారు. రాష్ట్రంలో రాజమండ్రి, విశాఖ పట్నం, విజయవాడ, తిరుపతి వంటి నగరాలతో పాటు అనంతపురం ఒక కీలక కేంద్రంగా ఎంపికైందన్నారు. ఈ సెంటర్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంటర్ వద్ద నాటిన మొక్కలను సంరక్షించాలని హార్టికల్చర్ డిడికి సూచించారు.

సెంటర్‌లో ఇంటర్నెట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, జిల్లా పరిశ్రమల శాఖ ఏడి రాజశేఖర్ రెడ్డి, నగర పాలక సంస్థ ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్.అండ్.బి జెఈ బాల కాటమయ్య, ఎస్కే యూనివర్సిటీ అధికారి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



# ధర్మవరంలో ప్రజలకు అందుబాటులో ఎన్డీఏ కార్యాలయం



**ధర్మవరం,పెన్ పవర్ ఆగస్టు 19 :** ధర్మవరంలోని 18వ వార్డ్ గాంధీనగర్‌కు చెందిన సర్వేయర్ కృష్ణమూర్తి, వైసీపీ నాయకుడు జానకి కంబగిరి అనుచరులు, మిత్రబృందంతో కలిసి మంగళవారం బీజేపీలో చేరారు. మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలనుకునే ప్రతి ఒక్కరికీ బీజేపీలో స్థానం ఉందని, అభివృద్ధి ఆకాంక్షతో కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. దేశ రాజకీయాలపై స్పందించిన ఆయన, చిన్నప్పటి నుంచీ మనం క్రీస్తు పూర్వం-క్రీస్తు శకం అని చదువుకున్నట్లే ఇవాళ దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ తర్వాత-బీజేపీ ముందు అనే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఓట్ల చోరీపై చర్చ లేపుతున్నా, అసలు ఈ దేశంలో ఓట్ల చోరీకి మూలకర్తలుగా ఉన్నవారు కాంగ్రెస్ నేతలేనని విమర్శించారు. స్వాతంత్ర్యం అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ 12 ఓట్ల తేడాతో గెలిచినా, జవహర్లాల్ నెహ్రూనే ప్రధానమంత్రిగా దేశ ప్రజలపై రుద్దిన చరిత్ర కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు.

ఈ దేశంలో పారదర్శకమైన పాలనను అందిస్తున్న నరేంద్ర మోడీ వంటి నాయకుడిని దెబ్బతీయడమే కాంగ్రెస్ కుట్ర అని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రవర్తన చులకనగా ఉందని, రాహుల్ గాంధీకి రాజకీయ అవగాహన లేదని, నైతిక విలువలు లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మంత్రి సత్యకుమార్ యాదవ్ కుమార్తె సంస్కృతి పేరుమీద నడుస్తున్న సంస్కృతి సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, వినికిడి లోపం ఉన్నవారికి హియరింగ్ మిషన్ పంపిణీ, నిరుపేదలకు మోకాళ్ల శస్త్ర చికిత్స కోసం వైద్యసాయం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ధర్మవరం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్, ఆయుర్వేదిక్ కళాశాల నిర్మాణం, బత్తలపల్లి మండలంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు వంటి ప్రాజెక్టులు త్వరలోనే రూపుదిద్దుకుంటాయని, ఇది మంత్రి సత్య కుమార్ యాదవ్ అభివృద్ధి దృష్టికోణానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శల దిశగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఇప్పుడు వెంటిలేటర్‌పై ఉన్న పార్టీ అని, ఆ పార్టీకి నేర చరిత్ర తప్ప అభివృద్ధి చరిత్ర లేదని అన్నారు. జగన్ చేస్తున్న యాత్రలు ప్రజలను మోసం చేసే యాత్రలేనని, అమరావతి నిర్మాణంపై చేసిన అవమానకర వ్యాఖ్యలు దుర్మార్గమని ధ్వజమెత్తారు. ధర్మవరంలోని కేతిరెడ్డి ప్రవర్తన ప్రజలకు తెలిసిపోయిందని, త్వరలోనే ఊచలు లెక్కిస్తారని వ్యాఖ్యానించారు. జాతీయ జెండా గురించి కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు సంస్కారహీనమని, దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని చులకనగా మాట్లాడటం ప్రజాస్వామ్యానికి అవమానం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరగా ఆయన మాట్లాడుతూ, ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఏర్పాటు చేసిన ఎన్డీఏ కార్యాలయం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రజాసేవే పార్టీ ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు, రూరల్ అధ్యక్షులు చంద్ర, శ్యామ్ రావు, కంచం లీలావతి, మైనార్టీ నాయకులు నబి రసూల్, కృష్ణాపురం జమీర్, చంద్రమౌళి, పోతుకుంట రాజు, సోమ్లా నాయక్, జూటూరు వెంకటేష్, శివశంకర్, తులసీదాస్, కుంచపు నారప్ప, గంగాధర్ మహాలక్ష్మి, రాధమ్మ, నాగరత్నమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కిరితారా రిసార్ట్స్ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తాం

## జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు,19 :** కిరితారా రిసార్ట్స్ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామనిజిల్లా కలెక్టర్ డాక్టర్. ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మెస్సర్స్ కిరితార రిసార్ట్స్ చీఫ్ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ వి.సత్యనారాయణ,ఆర్కిటెక్ జి.గంగరాజు, టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ లతో జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టూరిజం రీజనల్ డైరెక్టర్ మెస్సర్స్ కిరితార రిసార్ట్స్‌ను తిరుపతి జిల్లాలో ఏర్పేడు సమీపంలో ఐఐటీకి అతి చేరువలో 80 కోట్ల రూపాయల వ్యయంతో సుమారు 500 మందికి ఉపాధి కల్పించేలా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని జిల్లా కలెక్టర్ కు వివరించారు.

ఈనెల ఒకటవ తేదీన గండికోట వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించి అవగాహన ఒప్పందాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ నారా చంద్రబాబు నాయుడు గారి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అథారిటీ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం) మరియు మెస్సర్స్ కిరితార రిసార్ట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,మేనేజింగ్ డైరెక్టర్ మధ్య కుదిరిందన్నారు. ఆ రిసార్ట్ నందు ఆసియాలోనే అతి పెద్దదైన స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేస్తున్నారని అలాగే లగ్జరీ సూట్స్, హిల్ వ్యూ విల్లాలు, క్లబ్ హౌస్ ఇండోర్ మరియు అవుట్డోర్ గేమ్స్‌లు ఆడుకునేలా రిసార్ట్స్ ను రూపొందిస్తున్నార న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ,తిరుపతి జిల్లాలో అన్ని వసతులతో, పర్యావరణ హితంతో కూడిన రిసార్ట్స్ ను ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమన్నారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆ సంస్థ యాజమాన్యానికి జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ రిసార్ట్ ను త్వరితగతంగా నిర్మించి జిల్లాలోని ప్రజలతోపాటు తిరుపతికి విచ్చేయు పర్యాటకులకు సైతం అందుబాటులో తీసుకురావాలని జిల్లా కలెక్టర్ వారికి సూచించారు. ఈ సందర్భంగా మెస్సర్స్ కిరితార రిసార్ట్స్ చీఫ్ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం జనార్దన్ రెడ్డి, డైరెక్టర్లు కె. సుబ్బరాయుడు, ఈ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టులలో విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు రాత పరీక్షలు




కడప పెన్ పవర్ ఆగస్టు 19 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు వారు జిల్లా వ్యాప్తంగా కోర్టులలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు రాత పరీక్షలు 20-08-2025 నుండి 24-08-2025 వరకు నిర్వహించబడును అని తెలియజేశారు. ఈ పరీక్షలు కడప నందు గల శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల, కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల, కేఎల్ఎం ఇంజనీరింగ్ కళాశాల, కే ఓ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల మరియు అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల నందు నిర్వహించబడును. రాయచోటి నందు గల శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల మరియు భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాల నందు నిర్వహించబడును. ప్రొద్దుటూరు నందు గల శ్రీ రాజేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల నందు నిర్వహించబడును. ఈ పరీక్షలు ప్రతిరోజు మూడు షిఫ్ట్ లలో నిర్వహించబడును. మొదటి షిఫ్ట్ ఉదయం 7:30 నుండి 11 గంటల వరకు, రెండవ షిఫ్ట్ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2:30 వరకు, మూడవ షిఫ్ట్ మధ్యాహ్నం 2:30 నుండి 6:00 వరకు నిర్వహించబడును. హైకోర్టు వారు నిర్వహించే కోర్టు పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు గాని ఎలాంటి ప్రలోభాలు గాని లేదా ఎలాంటి అన్యత విషయాలు గానీ జరగవనీ, ఎగ్జామ్ ద్వారా పూర్తి మెరిట్ ప్రకారము సెలక్షన్ జరుగుతుంది. డ్రైవర్, టైపిస్ట్, కాపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులకు స్కిల్ టెస్ట్ నిర్వహించబడుతుంది. అదేవిధంగా ఎగ్జామ్ కు హాజరయ్యేవారు హాల్ టికెట్ను మరియు ఒక గుర్తింపు కార్డును తీసుకొని రావాలి, ఎగ్జామ్ ప్రారంభానికి 15 నిమిషాలు ముందే హాజరు కావాలి తర్వాత ఎవరిని కూడా నిర్ణయిత సమయం దాటిన తర్వాత లోనికి అనుమతించబడరు. కావున అభ్యర్థులందరూ హాల్ టికెట్లు ఇచ్చిన ఇన్స్ట్రక్షన్లను క్లుప్తంగా చదువుకొని ఎగ్జాంకు హాజరు కావలసిందిగా గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని తెలియజేశారు.

## గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సెప్టెంబర్ 30 వరకు బ్యాంకింగ్ సేవలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణ




**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 19 :** గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సెప్టెంబర్ 30 వరకు బ్యాంకింగ్ సేవలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ రాకేశ్ కశ్యప్ తెలిపారు. మంగళవారం అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం సింగంపల్లి తాండ గ్రామంలో బ్యాంకింగ్ సేవలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.నరేష్ రెడ్డితో కలిసి కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రీకెవైసి విధానం ను పరిశీలించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమాల్లో ప్రతి గ్రామానికి ఒక బ్యాంకు బాధ్యత వహిస్తుందని, బ్యాంకు ఖాతాలు లేని వారికి బ్యాంకు ఖాతాలు తెరిపించడం, ఖాతా ఉన్నా వినియోగంలో లేకపోతే వారికి ఈ రీకేవైసీ చేయించడం తదితర సేవలు అందిస్తామని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన, రూపే కార్డు యాక్టివేషన్ గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి మొబైల్ కు వచ్చే ఎటువంటి లింకులకు స్పందించకుండా ఉండాలని తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను లబ్ధి పొందాలంటే బ్యాంకు ఖాతా ఉంటే సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బాలాలయం సంప్రోక్షణ కార్యక్రమాలు ప్రారంభం





**కడప పెన్ పవర్ ఆగస్టు 19 :** దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బాలాలయ సంప్రోక్షణ కార్యక్రమాలు మంగళవారం ఉదయం ఆగమోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆగష్టు 20వ తేదీన మహాసంప్రోక్షణతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, శాంతి హోమం, వాస్తు హోమం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు కళాకర్షణలో భాగంగా గర్భాలయంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి మూలమూర్తి శక్తిని కుంభంలోకి ఆవాహన చేసి యాగశాలలో ప్రతిష్టించి ఆరాధనలు చేపడతారు. ఆగస్టు 20వ తేదీన ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, ఉదయం 10 నుంచి 11.15 గంటల మధ్య తులా లగ్నంలో బాల బింబ ప్రతిష్ట, బాలాలయ సంప్రోక్షణ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరిండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ





**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 19 :** కార్వేటినగరంలోని శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, శుద్ధి జరిగింది. ఉదయం 10 గంటలకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి మేదినీ పూజ, మృత్సంగ్రహణం, సేనాధిపతి తిరువీధి ఉత్సవం, అంకురార్పణం నిర్వహించారు. ఆగస్టు 20వ తేదీన ఉదయం మూలవర్లకు తిరుమంజనం, పవిత్రాల సమర్పణ నిర్వహిస్తారు.

సాయంత్రం 5.30 గంటలకు తిరువీధి ఉత్సవం, యాగశాలలో వైధిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రీకుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక ఇటువంటి దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలి..!

### రైతులకు ఎలాంటి యూరియా కొరత లేదు : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప,పెన్ పవర్ ఆగష్టు 19 :** జిల్లాలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను.. అక్రమంగా విక్రయించడం లేదా ఇతర అవసరాలకు మళ్లించినా.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ లోని తన ఛాంబర్‌లో టెక్నికల్ గ్రేడ్ యూరియా నత్రజని వనరుగా ఉన్న సబ్సిడీ యూరియాను పరిశ్రమల అవసరాలకు మళ్లిస్తున్నారన్న విషయమై.. వ్యవసాయ, సంబందిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి, వ్యవసాయంతో పాటు యూరియాను వినియోగిస్తున్న పలు పరిశ్రమలను గుర్తించి, వారి అవసరాలకు ఎక్కడి నుండి యూరియాను కొనుగోలు చేస్తున్నారన్న వివరాలపై ఆరా తీయాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టరేట్ సూచనల మేరకు.. జిల్లాలో వివిధ రకాల పరిశ్రమల్లో తుది ఉత్పత్తుల కోసం నత్రజని సమ్మేళనాలను ఉపయోగిస్తున్నాయన్న విషయంపై సంబందిత అధికారులు ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ చర్యలను ముమ్మరం చేయాలన్నారు. యూరియా సమ్మేళనాలను ముఖ్యంగా చక్కెర/మొలాసిస్‌ను ఆల్కహాల్‌గా మార్చే కిణ్వన ప్రక్రియలోను అలాగే ప్లైవుడ్& పార్టికల్ బోర్డ్ పరిశ్రమలలో అంటుకునే పదార్థంగా, ఉపరితల పూత కోసం, అలజీ డైయింగ్ యూనిట్లలో ఉపయోగిస్తారన్నారు. అంతేకాకుండా ప్రోటీన్ ప్రత్యామ్నాయంగా జంతులు, కోళ్లకు మేతగా కూడా యూరియా సమ్మేళనాలను వినియోగిస్తుంటారన్నారు. అందుకు సంబంధించి జిల్లాలోని పౌల్ట్రీలు, లిక్కర్, మొలాసిస్, ప్లైవుడ్/రెసిన్ యూనిట్లు, అలాగే పెయింట్స్/వార్నిష్ ఉత్పత్తుల పరిశ్రమలపై వారిపై దృష్టి పెట్టాలన్నారు. ఆయా యూనిట్లని వ్యవసాయ శాఖాధికారుల అధికారుల సమన్వయంతో, సంబంధిత ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో కలిసి ప్రత్యేక తనిఖీలను నిర్వహించాలన్నారు.

పౌర సరఫరాలు, పరిశ్రమలు, కార్మిక, ఎక్సైజ్ కాలుష్య బోర్డు మరియు రవాణా వంటి సంబంధిత శాఖల అధికారులు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ చర్యల్లో భాగంగా సంబంధిత పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. అక్కడ యూరియాను వినియోగిస్తున్నట్లయితే.. ఎక్కడి నుండి కొనుగోలు చేశారు ? సాధారణ నిర్ణీత ధర కంటే అధిక ధరలతో కొనుగోలు చేశారా ? అన్న విషయాలను సేకరించాలన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశ్రమలకు యూరియాను మళ్లించడం అనేది 1985 ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వుల నిబంధన 25 ఉల్లంఘనకు దారితీస్తుందన్నారు. చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవన్నారు. అక్రమంగా యూరియాను వినియోగిస్తున్నా, అధిక ధరలకు విక్రయిస్తున్నా, సంబంధిత సమాచారం కోసం జిల్లా వ్యవసాయ శాఖ వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

**కంట్రోల్ రూమ్ నెంబర్లు : 8331057300, 9491940106, 8919081933**

జిల్లాలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ఇప్పటికే 7,186 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం 3,366 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, మరో 4,368 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ఇండెంట్ కూడా పంపించడం జరిగిందన్నారు. కాగా జిల్లాలో యూరియా, సంబందిత ఎరువులకు ఎలాంటి కొరత లేదన్నారు. అలాగే.. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే ఎరువులను రైతులకు విక్రయించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రా నాయక్, ఎపి మార్క్ ఫెడ్ డిఎం పరిమళ జ్యోతి, కార్మిక శాఖ ఉప కమిషనర్ రంగరాజు, పశుసంవర్ధక అధికారి డా.అనుపమ, సివిల్ సప్లై అధికారి శిరీషా, డిఎం నాగసుధా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు లైన్లు విస్తరించే విధంగా రోడ్లు...



**కర్నూలు పెన్ పవర్ ఆగష్టు 19 :** నంద్యాల చెక్ పోస్ట్ నుండి గార్గేయపురం వరకు కి.మీ 0/0 నుండి 9/0 వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించే పనికి రూ. 90.00 కోట్లకు మంజూరు చేయబడింది. కర్నూలు గ్రామీణ మండలం గార్గేయపురం, రుద్రవరం మరియు పసుపుల గ్రామాల్లో భూసేకరణ పూర్తయింది మరియు పని పురోగతిలో ఉంది. ఇంకా, 2.35 కిలోమీటర్ల కెఎంసి పరిమితుల్లో, మున్సిపల్ అధికారులు భూయజమానులకు టిడిఆర్‌లు జారీ చేయడం ద్వారా భూమిని ఎన్హెచ్ విభాగానికి అప్పగించాలి. ఆ తర్వాత, ఎన్హెచ్ విభాగం ఆ భూమిలో నిర్మాణ పరిహారాన్ని చెల్లిస్తుంది. కెఎంసి వైపు టిడిఆర్‌ల జారీ పెండింగ్‌లో ఉంది. అందువల్ల, నిన్న జెసి మేడమ్ దృష్టికి దీనిని తీసుకురాబడింది. పైన పేర్కొన్న విషయాలను దృష్టిలో ఉంచుకుని, జెసి మేడమ్ నంద్యాల చెక్ పోస్ట్ నుండి శ్రీ సాయి గార్డెన్స్ వరకు కెఎంసి పరిమితుల్లోని రోడ్డును తనిఖీ చేసి, టిడిఆర్‌లను జారీ చేయడాన్ని వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జేసీ మేడమ్‌తో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి గారు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ...

**చిత్తూరు,పెన్ పవర్ ఆగస్టు 19 :** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ క్రింద సంవత్సరానికి రూ.20,000 మూడు దఫాలుగా ఇవ్వడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ నెల 02.08.2025వ తేదీన మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం నిధుల నుండి ?5,000 రూపాయలు రైతుల ఖాతాలకు జమ చేయబడిందని, అన్నదాత సుఖీభవకు సంబంధించి అర్హత కలిగి లబ్ది పొందని రైతులు రైతు సేవా కేంద్రం యొక్క సిబ్బంది ద్వారా అన్నదాత సుఖీభవ పోర్టల్ నందు గ్రీవెన్స్ మాడ్యూల్లో మీ ఫిర్యాదును నమోదు చేసుకోవాలని, ఫిర్యాదు నమోదుకు చివరి తేది 20.08.2025. కావున అర్హత కలిగి లబ్ధి పొందని రైతులు పై తెలిపిన గడువులోగా రైతు సేవా కేంద్రాలలో ఫిర్యాదును నమోదు చేసుకోవలసినదిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రతి గ్రామానికి ఆర్థిక పరిపుష్టి చేకూరాలి

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**కడప, పెన్ పవర్ ఆగస్టు 19 :** గ్రామాల్లో సుస్థిర జీవనోపాధులను నెలకొల్పి రైతులకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చేలా.. రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్.పి.ఓ.)లు, స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అంధికారులతో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. జిల్లా అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడవాలంటే అన్ని ప్రాధాన్యతా రంగ శాఖలు సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ముందుగా అన్ని గ్రామాల్లో సామాజిక స్థితిగతులు, ఆర్థిక స్థితిగతులు, అక్కడ అందుబాటులో ఉన్న వనరులు, వనరులను సద్వినియోగం చేసుకునేందుకు చేపట్టాల్సిన చర్యలకు సంబందించిన ప్రణాళికలు రూపొందించడం.. వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని అన్ని అన్ని గ్రామాల్లో సుస్థిర జీవనోపాధి, ఆర్థిక అభివృద్ధి సాధనకు అవసరమైన చర్యల్లో భాగంగా.. స్వయం సహాయక సంఘాలను, రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్.పి.ఓ.)లను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో 25 సంవత్సరాలుగా గ్రామీణాభివృద్ధి సంస్థ (సెర్ప్) పేదరిక నిర్మూలన కోసం కృషిచేస్తోందన్నారు. 26,965 స్వయం సహాయక సంఘాల ద్వారా 2.62 లక్షల మంది మహిళలు ఆర్థికంగా లబ్ది పొందుతున్నారన్నారు. వివిధ రంగాల్లో విభిధ రకాలుగా జీవనోపాధి పొందుతూ సాధికారత దిశగా అడుగులేస్తున్నారన్నారు. అధికశాతం వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారన్నారు. స్వయం సహాయక సంఘాలు, ఎఫ్.పి.ఓ. లను ఒకే గొడుగు క్రింద చేర్చి.. ప్రధాన్యత రంగాలకు సంబంధించి అన్ని రకాల వనరులను సద్వినియోగం చేస్తూ ఆయా కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయం, ఉద్యాన, పాడి పరిశ్రమ, పశు సంపద, పౌల్ట్రీ, మత్స్య సంపద, పట్టుపరిశ్రమ, కుటీర పరిశ్రమలు, వివిధ ఫైనాన్షియల్ కార్పోరేషన్ ల ద్వారా, బ్యాంకుల సహకారం ద్వారా, రైతు సంఘాలు, స్వయం సహాయక సంఘాల ప్రధాన భాగస్వామ్యంతో.. ఒక గ్రామానికి అన్ని రకాలుగా ఆర్థిక పరిపుష్టి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి గ్రామాల్లో సుస్థిర జీవనోపాధి కల్పన పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో బ్యాంకు, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, హార్టికల్చర్, సిరి కల్చర్, ఫిషరీస్, పరిశ్రమల శాఖ, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన ల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్.. జాతీయస్థాయి పురస్కారానికి ఎంపికైన వజ్రకరూర్ సర్పంచ్

### - జిల్లా కలెక్టర్‌ను అభినందించిన మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్





**అనంతపురం,పెన్ పవర్ ఆగస్టు 19 :** భారత నాణ్యత మండలి' దేశంలోని సర్పంచు లకు ఆన్లైన్లో నిర్వహించే 'సర్పంచ్ సంవాద్' పోటీల్లో అనంతపురం జిల్లా వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మండ్ల మోనాలీసా జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి గుర్తింపును పొందడం పట్ల అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మరియు వజ్రకరూరు సర్పంచ్ ఎం.మోనాలిసాకు రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సూర్య కుమారి, ఐఏఎస్ అభినందనలు తెలియజేశారు.


**జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైన వజ్రకరూరు సర్పంచ్ :** క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సర్పంచ్ సంవాద్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ అనే థీమ్‌పై జులై మాసానికి ఉత్తమ సర్పంచ్‌గా వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మండ్ల మోనాలీసా ఎంపికైంది. ఈ సందర్భంగా వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మండ్ల మోనాలీసా మాట్లాడుతూ తాను నిత్యం పట్టణంలో ఉన్న పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల తనిఖీకి వెళుతున్నానని తెలిపారు. ఇమ్యునైజేషన్ కార్యక్రమాల్లో పాల్గొనడం, ఇంటిగ్రేటెడ్, ఎస్సి బాలికల హాస్టల్స్, మోడల్ స్కూల్ హాస్టల్ ని తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. సాయంకాలం స్టడీ అవర్స్ ని, మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్నానని, నిత్యం పాఠశాలల్లో, మోడల్ కళాశాలలో విద్యార్థులతో ఇంటరాక్ట్ అవుతూ బాల్య వివాహాల నష్టాల గురించి, చదువుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, ప్రస్తుత పరిస్థితుల గురించి అవగాహన కల్పిస్తుంటామని తెలిపారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సర్పంచ్ సంవాద్ యాప్ ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ అనే థీమ్‌పై జులై మాసానికి సంబంధించి 1:30 నిమిషాల నిడివి గల వీడియో ద్వారా తాము పాల్గొన్న కార్యక్రమాల వివరాలు జులై 31వ తేదీలోపు అప్లోడ్ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి జులై మాసానికి సంబంధించి జాతీయస్థాయి పురస్కారానికి ఎంపికైనట్లు ఫోన్ రావడం జరిగిందన్నారు. మొదటి స్థానంలో జాతీయ స్థాయి పురస్కారం ఎంపికవడం పట్ల 35 వేల రూపాయల బహుమతిని అందించడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, మరియు జిల్లా యంత్రాంగం ఇచ్చిన సూచనలతో తాను అన్ని రకాల కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

**జాతీయ స్థాయి గుర్తింపును పొందడంతో జిల్లా కలెక్టర్ మరియు వజ్రకరూరు సర్పంచ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు :**

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన "సర్పంచ్ సంవాద్" పోటీలో చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ అనే థీమ్‌పై క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి జాతీయ స్థాయి గుర్తింపును పొందడంలో ప్రశంసనీయమైన విజయాన్ని సాధించినందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి మరియు వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి ఎం.మోనాలిసాకు రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సూర్య కుమారి, ఐఏఎస్ హృదయపూర్వక అభినందలు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మరియు వజ్రకరూరు సర్పంచ్ ను అభినందిస్తూ జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ లేఖ పంపించారు. అందులో అనంతపురం జిల్లాలో బాలలకు అనుకూలమైన పాలన దిశగా పంచాయతీని మార్గనిర్దేశం చేయడంలో మరియు మద్దతు ఇవ్వడంలో జిల్లా యంత్రాంగం యొక్క ప్రభావవంతమైన నాయకత్వాన్ని ఈ విజయం ప్రతిబింబిస్తుందని రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ తెలిపారు. నిరంతర మార్గదర్శకత్వం మరియు సమన్వయం ద్వారా, జిల్లా యంత్రాంగం గ్రామంలో బాలలకు అనుకూలమైన కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు, బాలల విద్య, బాల్య వివాహాల నివారణ, బాల కార్మికులు మరియు బాల యాచక నిర్మూలన మరియు పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం ఫిట్‌నెస్ మరియు యోగా కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి మిషన్ వాత్సల్య లక్ష్యాలను చురుకుగా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ పేర్కొన్నారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ మద్దతుతో అనంతపురం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు G.O.Ms.No.1 (బాలల సంక్షేమం మరియు రక్షణ కమిటీలు) మరియు G.O.Ms.No.31 & 39 (బాల్య వివాహాల నివారణ) వంటి కీలకమైన బాలల రక్షణ చట్టాలను అమలు చేస్తున్నాయని, ఇది రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ కృషిని కొనియాడారు. అనంతపురం జిల్లాను ఆదర్శవంతమైన బాలల, బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చాలనే దార్శనికతకు అనుగుణంగా, బాలల స్నేహపూర్వక కార్యకలాపాలను అమలు చేయడానికి గ్రామాలు మరియు మునిసిపాలిటీలకు మార్గనిర్దేశం చేయడంలో మరియు వాటిని బాలల, బాల్య వివాహ రహిత గ్రామాలుగా ప్రకటించడానికి కృషి చేయడంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, చురుకైన పాత్ర పోషించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ పేర్కొన్నారు.

## జీవితంలో, మనకు తరచుగా చాలా చిన్నచిన్న బాధాకరమైన లేదా వేధించే అనుభవాలు ఉంటాయి

అలాంటి అనుభవాల వల్ల ప్రయోజనం ఏమిటి? అలాంటి అనుభవాలు మన గురువులు కాదా?

**కడప పెన్ పవర్ ఆగస్టు 19 :** చిన్న అద్దంకులు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై సెప్టెంబర్ 11న జరిగిన దాడి తర్వాత, ఆ దాడి నుండి బయటపడిన కంపెనీ సభ్యులను తమ తమ అనుభవాలను పంచుకోవడానికి ఒక కంపెనీ ఆహ్వానించింది. దాడి నుండి ప్రాణాలతో బయటపడిన ఉద్యోగులందరితో కాసేపు జరిగిన సంభాషణ తర్వాత, ఒక కంపెనీ అధికారి లేచి తనవారందరికీ ఏమి జరిగిందో, దేని కారణంగా వారందరూ ఈ రోజు సజీవంగా ఉన్నారో వివరించడం ప్రారంభించారు. ఆ కథలలోని ఆ కారణాలన్నీ కూడా మనలో చాలా మంది ప్రాధాన్యతలేనివిగా విస్మరించే చిన్న చిన్న విషయాలు మాత్రమే. తన కొడుకు మొదటిసారిగా స్కూల్ కి వెళ్తుండడంతో, అతనిని పాఠశాలలో దించడానికి వెళ్ళి, ఆ కంపెనీ అధికారి ఆ రోజు ప్రాణాలతో బయటపడ్డారు. ఆ రోజు డోనట్స్




తీసుకురావడం తన వంతు కావడంతో ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. ఒక మహిళ తన గడియారపు అలారం సమయానికి మ్రోగనందున ఆఫీసుకు చేరుకోవడంలో ఆలస్యం అయింది. అందులో ఒకరికి బస్సు మిస్సయింది. ఇంకొక వ్యక్తి తన బట్టలపై ఆహారాన్ని వంపుకోవడం వలన, బట్టలు మార్చుకోవడానికి అతనికి సమయం పట్టింది. ఇంకొకరు ఫోన్ మాట్లాడాలని కోసం ఆగడం వలన వారికి ఆలస్యమయింది. ఒకరికి వారి పిల్లవాడు సమయానికి పాఠశాలకు సిద్ధంచలేదు కాబట్టి ఆలస్యం అయింది. వేరొకరు టాక్సీని సమయానికి అందుకోలేకపోయారు. కొత్త షూస్ కారణంగా ఒక వ్యక్తి పాదాల మీద బొబ్బలెక్కాయి, బ్యాండేజ్ కొనడానికి మందుల దుకాణం వద్ద ఆగిపోయాడు. అందుకే ఈరోజు బ్రతికి ఉన్నాడు. నేను ఈసారి ఎప్పుడైనా ట్రాఫిక్ లో చిక్కుకుపోతే, ఎలివేటర్ తప్పిపోతే, మోగుతున్న టెలిఫోన్ కి సమాధానం ఇవ్వడానికి వెనక్కి తిరిగిరావలసి వస్తే ... ఇలా చికాకు కలిగించే ఎన్నో చిన్న విషయాలు నాకు సంభవిస్తే .. నాలో నేను – 'భగవంతుడు ఈ క్షణంలో నన్ను ఎక్కడ ఉండాలనుకున్నాడు' – అని అనుకుంటున్నాను ...

తదుపరి ఎప్పుడైనా... మన ఉదయసమయం సరిగా లేన్నట్లు అనిపించినా,
పిల్లలు నెమ్మదిగా తయారవుతున్నా, కారు తాళం కనబడకపోయినా,
ట్రాఫిక్ సిగ్నల్ లైట్ పడినా, కలత పడకండి, నిరాశ చెందకండి.

ఇలాంటి విషయాలన్నింటికీ మనం ఎలా స్పందిస్తామో తెలుసుకోవడానికి భగవంతుడు మనల్ని ప్రతి క్షణం గమనిస్తున్నాడని గుర్తుంచుకోండి. మనకు ఇబ్బంది కలిగించే చిన్న చిన్న విషయాలను భగవంతుడు మనకు పంపినప్పుడు, దాని వెనుక ఆయనకున్న ఉద్దేశం గురించి ఆలోచిస్తామా!... చిన్న అద్దంకులు అనేవి స్పీడ్ బ్రేకర్లు. అవి మన జీవితాన్ని పెద్ద లక్ష్యాల వైపు మళ్లించడానికి సిద్ధం చేస్తాయి. జ్ఞానం ఇలా చెబుతుంది, "ఎల్లప్పుడూ నిజాయితీగా ఉండండి. దుఃఖాలు/కష్టాలు మన మంచి కోసమే భగవంతుని నుండి వచ్చినవిగా అంగీకరించండి. ఆ అవకాశం వచ్చినందుకు కృతజ్ఞతతో ఉండండి." ఒక అనుభవం మనల్ని మార్చుకోలేకపోతే, నిజంగా దానికి విలువ ఉంటుందా? మన అనుభవం ఎప్పుడూ మన అంతర్గత స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. మనమేంటో చూపిస్తుంది. ఈ విధంగా చూస్తే అవి మన వివేకానికి ప్రక్రియలోని సాధనాలు. జ్ఞానం ఇలా చెబుతుంది, "ఎల్లప్పుడూ నిజాయితీగా ఉండండి. దుఃఖాలు/కష్టాలు మన మంచి కోసమే భగవంతుని నుండి వచ్చినవిగా అంగీకరించండి. ఆ అవకాశం వచ్చినందుకు కృతజ్ఞతతో ఉండండి.

దాజీ
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం
అనువాదబృందం ఆంధ్రప్రదేశ్

## మానవతా సేవలు అత్యద్భుతం




**అన్నమయ్య పెన్ పవర్ ఆగస్టు 19 :** మానవతా శాంతి ర్యాలీలో పాల్గొని ర్యాలీని ప్రారంభించిన అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్, డిప్యూటీ తహసిల్దార్ వంశీ రెడ్డి, రిటైర్డ్ విద్యాశాఖ అధికారి రెడ్డన్న మానవతా సేవలు అత్యద్భుతమని,ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని, ప్రతి ఒక్కరిలో మానవతా విలువలు కలిగి ఉండాలని కోరారు అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ డిప్యూటీ తహసిల్దార్ వంశీ రెడ్డి రిటైర్డ్ విద్యాశాఖ అధికారి రెడ్డన్న. మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో మానవతా సంస్థ చైర్మన్ అరమటి శివగంగి రెడ్డి అధ్యక్షులు అంకం జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు ఎస్ఐ విష్ణువర్ధన్.ఈ ర్యాలీలో మానవత కుటుంబ సభ్యులు, ప్రతిభ జూనియర్ కళా శాల యాజమాన్యం, ఆధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ ర్యాలీ తహసిల్దార్ కార్యాలయం,బస్టాండ్ కూడలి, కంసల్ వీధి, ఠాణా సర్కిల్ నేతాజీ కోడలి వరకు కొనసాగింది. నేతాజీ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేసి మానవతా సంస్థ యొక్క ఉద్దేశాలు అమలు చేసే ఆశయాలు తదితర అంశాలు వివరిస్తూ ప్రతిజ్ఞ గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం వ్యాప్తంగా ఆపదలలో ఉన్నవారికి మానవత సంస్థ వారు సహృదయంతో సేవలు అందించుచుండడం అభినందనియమన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 15 నుండి 22 వరకు మానవ సంస్థ వారు రాష్ట్ర వ్యాప్తంగా శాంతి ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈరోజు రాయచోటి పట్టణంలో మానవత సంస్థ కుటుంబ సభ్యులు, అధ్యాపకులు విద్యార్థులచే పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి, ర్యాలీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డి.ఎస్.పి కృష్ణమోహన్, అర్బన్ సి ఐ వెంకటాచలపతి, ట్రాఫిక్ సి కులాయప్ప ఆధ్వర్యంలో ఎస్ఐలు జహీర్, విష్ణువర్ధన్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి, అధ్యక్షులు అంకం జయచంద్ర రెడ్డి లు.ఈ ర్యాలీలో మున్సిపల్. డీఈ విజయ్ కుమార్,గౌరవ సలహాదారులు వెంకటరమణ,మానవత ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చింతంరెడ్డి వెంకట్రామి రెడ్డి,ఉపాధ్యక్షులు మురళి మోహన్,మేకల శివా రెడ్డి, బీఏ నాగయ్య,రామచంద్ర రెడ్డి,మాజీ అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాషా, బోజనపు శివరామకృష్ణ,హరినాథ్ రెడ్డి,నరసింహా రెడ్డి, బసిరెడ్డి,రత్నం,పోలంరెడ్డి విల్వపతి రెడ్డి తదితర మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా జీవనోపాధులు

### - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 19 :** స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా వివిధ శాఖల ద్వారా జీవనోపాధులు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో స్వయం సహాయక సంఘాల స్థిరమైన జీవనోపాధి కోసం వార్షిక రుణ జీవనోపాధి కార్యాచరణ ప్రణాళిక అమలు పై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పించి వారి ఆదాయాన్ని పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. ఇందు కోసం సంఘాల మహిళలను సర్వే చేసి వారి అవసరాల మేరకు వార్షిక రుణ జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, ఆయా శాఖల ద్వారా అమలు చేయడం జరుగుతోందన్నారు.. జిల్లాలో లక్షా 34 వేల మంది మహిళలు వ్యవసాయ శాఖకు సంబంధించిన డ్రోన్లు, పవర్ స్ప్రేయర్లు, హార్వెస్టర్ యంత్రాలు తదితరాలను కావాలని కోరడం జరిగిందన్నారు..ఆ మేరకు మండల వ్యవసాయ అధికారులతో కో ఆర్డినేట్ చేసుకొని ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని, మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించి, జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ డీఆర్డీఏ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే పశుసంవర్ధక శాఖకు సంబంధించి గొర్రెలు, మేకలు కావాలని 1000 మంది స్వయం సహాయక సభ్యులు అడుగుతున్నారని, పాలిచ్చే ఆవులు కావాలని 13 వేల 500 మంది స్వయం సహాయక సభ్యులు అడుగుతున్నారని, వీరందరిని జాయింట్ లయబిలిటీ గ్రూప్ లుగా ఏర్పాటు చేసి నేషనల్ లైవ్ స్టాక్ పథకం కింద రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్డిఎం, పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. సంబంధిత లబ్ధిదారుల జాబితాను బ్యాంక్ అధికారులకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్డిఏ పిడిని ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద 2 వేల 500 మంది సభ్యులు యూనిట్లకు లోన్‌లు ఇప్పించాలని అడుగుతున్నారని, వీటిని బ్యాంక్ బ్రాంచ్ లకు టార్గెట్ ల ప్రకారం పంపాలని, అర్హత మేరకు ఉన్న వారికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్డిఎం ను ఆదేశించారు. ఉద్యానవన శాఖకు సంబంధించి రైతు ఉత్పత్తిదారుల సంస్థలను మరిన్ని ఏర్పాటు చేసే పె విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉద్యాన వన శాఖ అధికారిని ఆదేశించారు.. మండలాలలో ఉండే రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు, ఇతర రాష్ట్రాలకు పండ్లను ఎగుమతి చేసే సంస్థలతో అనుసంధానం చేసి మార్కెటింగ్ సౌకర్యాలు పెంచే



విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కలెక్టర్ ఉద్యాన వన శాఖ అధికారిని ఆదేశించారు. ఫిషరీస్ కి సంబంధించి చేపలు అమ్మే స్వయం సహాయక సభ్యులు ఎవరైనా ఉంటే వారికి అర్హత మేరకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద షాపులు పెట్టించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. అదే విధంగా నెట్స్ లాంటి పరికరాలను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. అదే విధంగా నాబార్డ్ కింద ఏవైనా పథకాలు ఉంటే అందులో లబ్ధిదారులను చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్డిఏ పిడిని ఆదేశించారు. సంఘాల మహిళల జాబితాను ఆయా శాఖల అధికారులకు పంపించాలని కలెక్టర్ డీఆర్డీఏ పిడిని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, ఎల్డిఎం రామచంద్ర రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, నాబార్డ్ ఏ జి ఎం సుబ్బారెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి రంగనాథ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు..

## రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలను పరిశీలించిన సంయుక్త కలెక్టర్ డాక్టర్ బి.నవ్య




**కర్నూలు, పెన్ పవర్ 19 ఆగస్టు :** కర్నూలు సంయుక్త కలెక్టర్ శ్రీమతి డాక్టర్ బి.నవ్య, కల్లూరు మండలంలోని మార్కాపురం, గోకులపాడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను మరియు కర్నూలు మండలంలోని గార్గేపురం రైతు సేవా కేంద్రం గార్గేపురం వ్యవసాయ సహకార సంఘంలను పరిశీలించారు. ఈ సందర్భనలో సంయుక్త కలెక్టర్ ఎరువుల నిల్వలు మరియు రైతులకు అందజేస్తున్న సేవలను పరిశీలించారు.

మార్కాపురం రైతు సేవా కేంద్రంలో 45 మెట్రిక్ టన్నుల యూరియా అందగా, 41 మెట్రిక్ టన్నులు 231 మంది రైతులకు విక్రయించబడినట్టు పరిశీలించారు. గోకులపాడు రైతు సేవా కేంద్రంలో 35 మెట్రిక్ టన్నుల యూరియా అందగా, 34 మెట్రిక్ టన్నులు 217 మంది రైతులకు పంపిణీ చేసినట్టు నిర్ధారించారు. అలాగే ఈ-పంట యాప్ ద్వారా కంది పంట బుకింగ్ కూడా పరిశీలించారు. లిగార్గేపురం రైతు సేవా కేంద్రం లో 37.8 మెట్రిక్ టన్నుల యూరియా అందగా, 25.6 మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేసినట్టు గుర్తించారు. గార్గేపురం వ్యవసాయ సహకార సంఘం ద్వారా 92.7 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు విక్రయించబడింది. అదనంగా %భూజం% ద్వారా 40 కేసుల నానో యూరియా విక్రయించబడింది.

**ప్రధాన సూచనలు :** 1.ప్రతి రైతుకు గరిష్టంగా 3 సంచులు యూరియా మాత్రమే విక్రయించాలి.

2.రైతులు నానో యూరియాతో ఫోలియర్ స్ప్రే చేయడంకు ప్రాధాన్యం ఇవ్వాలి, ఇది సాంప్రదాయ ఎరువుల కంటే ఎక్కువ ప్రయోజనకరం.

3.నానో యూరియా మరియు నానో డీఏపీ వినియోగాన్ని ప్రోత్సహించాలి.

4.రైతులు యూరియా అధికంగా వినియోగించవద్దని సూచించారు.

5.అన్ని రైతు సేవా కేంద్ర సిబ్బంది పంట బుకింగ్ ను వేగవంతం చేయాలని మరియు ఈ-పంట యాప్‌లో సమయానుసారంగా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

6.అన్ని రైతు సేవా కేంద్ర సిబ్బంది నానో యూరియా మరియు నానో డీఏపీకి ఇండెంట్లు వేయాలని సంయుక్త కలెక్టర్ గారు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

సంజుక్త కలెక్టర్ గారు రైతులతో మాట్లాడి, సమతుల్యంగా ఎరువుల వినియోగం, నానో ఎరువుల ప్రయోజనాలు, నేల సారవంతం కాపాడుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ADA సాలూ రెడ్డి , కల్లూరు వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి, కర్నూలు MAO రూఫస్ రోనాల్డ్ గారు కూడా పాల్గొన్నారు.

## జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు , పెన్ పవర్ అగస్ట్ 19 :** జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులనుఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సంబంధిత శాఖలు అన్నీ ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుని పూర్తిస్థాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు..యూనివర్సిటీలు , కాలేజీలలో మత్తు పదార్థాల వినియోగంపై వర్క్ షాపులు, ర్యాలీలు తదితర అవగాహన కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు మెడికల్ కళాశాలలో కూడా విద్యార్థులకు అవగాహన కల్పించి మత్తు పదార్థాల వినియోగం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డివిజన్ల వారీగా ఈ అంశంపై తీసుకుంటున్న చర్యల గురించి సబ్ కలెక్టర్ ఆదోని, పత్తికొండ, కర్నూలు ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ ఆదోని మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ... ఆదోని ఆర్ట్స్ కాలేజీలో అవగాహన కార్యక్రమాలు జరిపామని, కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఆదోని ఆర్డీవో భరత్ నాయక్ లు మాట్లాడుతూ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని, ఈ క్రాపింగ్ సమయంలో అంతర పంటలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎక్సైజ్, రవాణా శాఖలు కూడా ఈ అంశంపై దృష్టి సారించి, తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.. మత్తు పదార్థాలు సేవించేవారికి రిహాబిలిటేషన్ సెంటర్లో వైద్యం అందించి కౌన్సిలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ ఓ, సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం, సాగును పూర్తిగా నియంత్రించే విధంగా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు..కేసీ కెనాల్, బస్టాండ్ , రైల్వే స్టేషన్ లలో, రాత్రి సమయాల్లో పార్కులు, ఖాళీ ప్రదేశాలు, ఫ్లై ఓవర్ల లాంటి వాటిలో నిఘా ఉంచడం జరుగుతోందన్నారు.. మత్తు పదార్థాలు సేవించే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, వారిని తిరిగి మత్తుపదార్థాల వైపు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. రైల్వే, లోకల్ పోలీస్, ఈగల్ టీమ్స్, ఎక్సైజ్ సిబ్బంది టాస్క్ ఫోర్స్ గా ఏర్పడి తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.. ఈగల్ ఎస్సై సుజన్ కుమార్ కేసుల వివరాలను వివరించారు. అనంతరం మత్తు పదార్థాల నిర్మూలనకు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ శాంతకుమారి, ఆర్టీసీ ఆర్ ఎం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, మెడికల్ కాలేజ్, వైద్య శాఖ అధికారులు, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డిగ్రీ కాలేజ్, జూనియర్ కాలేజ్ ల ప్రిన్సిపల్ లు తదితరులు పాల్గొన్నారు.

## జవాబుదారీతనానికి పారదర్శకతకు పాతరేసిన ఎన్నికల కమిషన్ డా. ముచ్చుకోట సురేష్ బాబు



**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 19 :** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా స్వామ్య దేశానికి సంరక్షకుడిగా ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడిన భారత ఎన్నికల కమిషన్ , ఇప్పుడు తప్పుడు కారణాల, నిర్ణయాల వల్ల తీవ్ర అప నమ్మకాన్ని గురవుతోంది. బీహార్‌లో "ఓట్ల దొంగతనం" ఆరోపణలను పరిష్కరించడానికి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఎన్నికల కమిషన్ సందేహాలు నివృత్తి కంటే ఎక్కువ సందేహాలను లేవనెత్తి సమస్యను మరింత జటిలం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాహుల్ గాంధీ ఆరోపణలను "నిరాధారమైనది" అని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ, అఫిడవిట్ లేదా జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల నిర్వహణ, కమిషన్ నిష్పాక్షికత గురించి అనేక ప్రాథమిక ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేదు. ఎన్నో ప్రశ్నలకు దాటవేసే ధోరణి కొనసాగింది, నీళ్లు నమలడం తప్ప చేయగలిగింది ఏమి లేదని సమాధానాలు దాటవేశారు. ఓటర్లకు భరోసా ఇవ్వడానికి బదులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రతిస్పందనలు లేకపోవడం – చట్టబద్ధమైన ఆందోళనలతో పాల్గొనడానికి ఇష్టపడని సంస్థ ఇమేజ్‌ను చిత్రించాయి. వరద ప్రభావిత బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎందుకు అమలు పరుస్తున్నారు? ఎన్నికల సంవత్సరంలో అటువంటి సవరణకు వ్యతిరేకంగా కమిషన్ స్వంత మార్గదర్శకాల ఉల్లంఘన, ఎన్నికల జాబితా ఫార్మాట్లలో ఆకస్మిక మార్పులు, ప్రతిపక్ష నాయకులు గతంలో సమర్పించిన అఫిడవిట్‌లపై చర్య తీసుకోకపోవడం వంటి ప్రశ్నలు అన్నీ పక్కదారి పట్టాయి. ఓటరు ఐడి నకిలీ, బయోమెట్రిక్ భద్రతా ప్రమాణాలు లేకపోవడం మెషిన్-రీడబుల్ రోల్స్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలపై జర్నలిస్టులు కమిషన్‌ను ఒత్తిడి చేశారు. ఎన్నికల విశ్వసనీయతకు కేంద్రంగా ఉన్న పదకొండు ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు రాలేదు. కమిషన్ పక్షపాత పద్ధతిలో వ్యవహరిస్తుందనే ప్రతిపక్ష ఆరోపణను తేలికగా తోసిపుచ్చలేము. ఒక రాజకీయ నాయకుడి నుంచి అఫిడవిట్లు డిమాండ్ చేస్తూ, ఇతరులు ఇలాంటి వాదనలు విస్మరిస్తే, ఎన్నికల కమిషన్ దాని పరిశీలనలో ఎంపిక చేసుకుంటుందనే భావనను బలపరుస్తుంది. సాక్ష్యం నిరూపించబడక ముందే-పక్షపాత ధోరణి, అవగాహన కూడా పూర్తిగా ప్రజా విశ్వాసం పై ఆధారపడే సంస్థకు క్షీణిస్తుంది. ఎన్నికల కమిషన్ అధికారం రాజ్యాంగ బద్ధమైనది మాత్రమే కాదు, నైతికమైనది కూడా అని గుర్తుంచుకోవడం ముఖ్యం. దాని విశ్వసనీయత రాజకీయ పోరాటాలకు అతీతంగా ఉండి, ప్రభుత్వాలు లేదా పార్టీలకు కాదు, ఓటరుకు సేవ చేయగల సామర్థ్యం పై ఆధారపడి ఉంటుంది. ఎన్నికల సమగ్రతకు కేంద్రంగా ఉన్న ప్రశ్నలను తప్పించుకోవడం ద్వారా, భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లు. పారదర్శకతను కోరుతున్న సమయంలో కమిషన్ ఆ విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంది. బీహార్ వివాదం ఒక వివిక్త సంఘటన కాదు. జాతీయ ఎన్నికలు సమీపిస్తున్నందున, ఓటర్ల జాబితాలను నిర్వహించడం, విధానపరమైన న్యాయాన్ని నిర్ధారించడం విశ్వసనీయ ఆరోపణలకు ప్రతిస్పందించడంలో కమిషన్ ప్రవర్తన ఒక రాష్ట్ర ఎన్నికల ఫలితాన్ని మాత్రమే కాకుండా, ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధతను కూడా నిర్ణయిస్తుంది. 2004లో, రాబోయే ఎన్నికల కారణంగా ఎన్నికల కమిషన్ అరుణాచల్ ప్రదేశ్ మహారాష్ట్రలలో ఇలాంటి సవరణ చర్యలను వాయిదా వేసింది. ప్రజాస్వామ్యం హామీల ద్వారా మాత్రమే నిలవదుబీ ఇది నిష్పాక్షత జవాబుదారీతనంపై వృద్ధి చెందుతుంది. కీలక అంశాలపై కమిషన్ మౌనం వహించడం తటస్థత కాదని-అది తన బాధ్యతను వదులు కోవడమేనని గుర్తుంచుకోవడం మంచిది. విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, అది వాస్తవాలను రికార్డులో ఉంచాలి, దాని ప్రక్రియలను పూర్తిగా వివరంగా వివరించాలి రాజకీయ నాయకులు, పౌర ప్రజా సంఘాల నుంచి అది ఆశించే పరిశీలనకు లోబడి ఉండాలి. ఎన్నికల కమిషన్ ఖ్యాతి కంటే ప్రమాదం అంచున ఉందని ప్రజలు భావిస్తే కష్టం. ఎన్నికలను భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా చేసే నమ్మకం సమతుల్యత మధ్య వేలాడుతోంది. బీహార్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో, కమిషన్ ఒక ప్రెస్ మీటింగ్ పెట్టి తమ వైఫల్యాలను బహిర్గతపరుచుకుంది. విమర్శకులతో బహిరంగంగా పాల్గొనాలి, రాజకీయ పార్టీలు కోరినట్లే తనను తాను పరిశీలించుకోవాలి. ఏదైనా తక్కువైతే, "స్వేచ్ఛాయుతమైన మరియు న్యాయమైన ఎన్నికలు" అనే పదబంధం ఒక వాస్తవికత గా కాకుండా ఒక ఆచార మంత్రంగా మారే ప్రమాదం ఉంది. ప్రజా స్వామ్యంలో, సూర్యకాంతి ఉత్తమ క్రిమిసంహారక మందు. ఎన్నికల కమిషన్ నీడ వెనుక దాక్కున్న అందరూ ఓడిపోతారు.

## అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం



**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 19 :** తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం భవనం చుట్టూ శిథిలావస్థలో ఉన్న దుకాణాలు తొలగించే ప్రక్రియపై స్థానిక ఎమ్మెల్యే, నగర పాలక సంస్థ కమిషనర్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్.

## మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు

### పెద్ద కొప్పెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్



**బనగానపల్లి పెన్ పవర్ ఆగస్టు 19 :** బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు&భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కోవెలకుంట్ల మండలం పెద్ద కొప్పెర్ల వ్యవసాయ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన గడ్డం వెంకటేశ్వరరెడ్డి. పెద్ద కొప్పెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నియమితులైన క్రమంలో నేడు మంత్రిని కలిసి సంతోషం వ్యక్తం చేస్తూ.. కృతజ్ఞతలు తెలిపిన గడ్డం వెంకటేశ్వర రెడ్డి.

# మోడీ ఎఫెక్ట్ : అమెరికాలో మెలోనీ 'నమస్తే'..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా వైట్‌హౌస్‌లో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చేసిన చిన్న సంస్కార హావభావం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబించే 'నమస్తే' అంటూ అధికారులను పలకరించిన ఆమె వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ దృశ్యాన్ని చూసిన నెటిజన్లు "ఇది మోదీ ఎఫెక్ట్" అంటూ కామెంట్లు పెడుతున్నారు.

**వైట్‌హౌస్‌లో మెలోనీ ప్రత్యేక శైలి**

ఉక్రెయిన్ - రష్యా యుద్ధ పరిష్కారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్%-%జెలెన్స్కీ భేటీకి హాజరయ్యేందుకు వైట్‌హౌస్‌కు చేరుకున్న మెలోనీకి ఆతిథ్యమిచ్చిన అధికారులు ముందుగా షేక్‌హ్యాండ్స్‌తో స్వాగతం పలికారు. అయితే ఆమె కేవలం చేతులు కలపడం మాత్రమే కాకుండా భారతీయ శైలిలో రెండు చేతులు జోడించి 'నమస్తే' అన్నారు. ఈ హావభావం చూసిన వారంతా ఆశ్చర్యపోయారు.

**మోదీ ఎఫెక్ట్?**

ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికలపై 'నమస్తే'ను ప్రాధాన్యం ఇవ్వడం తెలిసిందే. కరోనా కాలంలోనూ, అధికారిక సమావేశాల్లోనూ ఆయన 'నమస్తే'ను గౌరవప్రదంగా ఉపయోగించారు. అదే ప్రభావం మెలోనీపై పడిందని నెటిజన్లు భావిస్తున్నారు. "ఇది మోదీ ఎఫెక్ట్", "ఇండియన్ కల్చర్ గ్లోబల్ లెవెల్‌లోకి వెళ్ళింది" అంటూ సోషల్ మీడియాలో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఇది తొలిసారి కాదు**

మెలోనీ 'నమస్తే' చెప్పడం ఇదే తొలిసారి కాదు. 2024లో ఇటలీలో జరిగిన జీ7 సమ్మిట్‌లో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డేర్ లేయన్, యూకే ప్రధాని రిషి సునాక్, భారత ప్రధాని మోదీలకు ఆమె నమస్కారం చేసి స్వాగతం పలికారు. ఆ వీడియో కూడా అప్పుడు విపరీతంగా వైరల్ అయ్యింది.

**గ్లోబల్ గుర్తింపు పొందుతున్న భారతీయ సంప్రదాయం**

భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా గౌరవం పెరుగుతోంది. 'నమస్తే' అనేది కేవలం అభివాదం మాత్రమే కాకుండా, "నేను నిన్ను గౌరవిస్తున్నాను" అనే అర్థాన్ని ఇచ్చే సంస్కార పద్ధతి. దీనిని మెలోనీ లాంటి అంతర్జాతీయ నేతలు అనుసరించడం భారతీయ సంస్కృతికి పెరుగుతున్న గౌరవానికి నిదర్శనం.

# చైనా-భారత్ సంబంధాల్లో కొత్త పరిణామాలు...!



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్యయుద్ధం ప్రభావంతో భౌగోళిక రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ పరిణామాల మధ్య న్యూఢిల్లీ%-%బీజింగ్ సంబంధాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. ఇరుదేశాల మధ్య ఉన్న వైరాన్ని పక్కనబెట్టి, పరస్పర సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్‌కు అత్యవసరంగా కావలసిన ఎరువులు, టన్నెల్ బోరింగ్ యంత్ర పరికరాలు , రేర్‌ఎర్త్ ఖనిజాల సరఫరాకు చైనా అంగీకరించడం ఈ భేటీ ముఖ్యఫలితంగా నిలిచింది.

**ఎరువుల సరఫరాలో చైనాపై ఆధారపడుతున్న భారత్**

గత కొన్ని నెలలుగా భారత్‌కు చైనా ప్రత్యేక ఎరువుల ఎగుమతులను నిలిపివేసింది. అయితే ఇతర దేశాలకు మాత్రం అవే ఎరువులను సరఫరా చేయడం గమనార్హం. పండ్లు, కూరగాయలు, ధాన్య పంటల దిగుబడిని పెంచడంలో ఈ ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయి. వీటి ఉత్పత్తి సామర్థ్యం భారత్‌లో పరిమితంగానే ఉండటం వల్ల 80 శాతం అవసరాలను చైనాపైనే ఆధారపడాల్సి వస్తోంది.

2023లో భారత్‌కు రావాల్సిన యూరియాను కూడా చైనాకు చెందిన రెండు పెద్ద కంపెనీలు నిలిపివేశాయి. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. తాజాగా వాంగ్‌యీ పర్యటనలో ఎరువుల సరఫరా సమస్యపై జైశంకర్ ప్రస్తావించగా, చైనా ప్రభుత్వం సహకరించేందుకు సిద్ధమని తెలిపింది.

**తైవాన్‌పై భారత వైఖరి స్పష్టత**

తైవాన్ విషయంలో భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని జైశంకర్ స్పష్టం చేశారు. తైపీలో భారత ప్రతినిధులు కేవలం ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల కోసం మాత్రమే ఉన్నారని ఆయన వాంగ్‌యీకి వివరించారు.

**రాబోయే సమావేశాల ప్రాధాన్యత**

నేడు సరిహద్దు సమస్యలపై ప్రత్యేక ప్రతినిధుల 24వ సమావేశం జరుగనుంది. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్‌తో వాంగ్‌యీ ఉదయం 11 గంటలకు భేటీ అయ్యారు.. ఈరోజు సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో కూడా ఆయన సమావేశమవుతారు.

**ద్వైపాక్షిక సంబంధాలకు ఊపు**

ఇరుదేశాల మధ్య ఏర్పడిన కొత్త అవగాహన ఒప్పందాలు, గత చర్చల్లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడమే వాంగ్‌యీ పర్యటన ప్రధాన ఉద్దేశమని చైనా వెల్లడించింది. ముఖ్యంగా ఎరువులు, రేర్‌ఎర్త్ మినరల్స్ వంటి కీలక వనరుల సరఫరా పునరుద్ధరణతో భారత్%-%చైనా సంబంధాలు మళ్లీ సాధారణ స్థితికి చేరుకోవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# తంబళ్లపల్లిలో తమ్ముళ్ల కొట్లాట.. ఏం జరుగుతోంది ..!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి నియోజకవర్గంలో టిడిపి నాయకుల మధ్య వర్గ విభేదాలు కొనసాగుతున్నాయి. గత ఎన్నికలకు ముందు తర్వాత కూడా ఈ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయని సీనియర్ నాయకులు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతానికి తంబళ్లపల్లి నియోజకవర్గంలో వైసిపి విజయం దక్కించుకుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికైనా టిడిపిని బలోపేతం చేయాలని వచ్చే ఎన్నికల నాటికి టీడీపీ విజయం సాధించాలని చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. గత రెండు నెలల కిందట జరిపిన చిత్తూరు పర్యటనలో నాయకులకు నిర్దేశం చేశారు.

అప్పట్లో అందరూ సరైనని తలలు ఊపారు. కానీ, ఆ తర్వాత పరిణామాలు గమనిస్తే నాయకుల్లో మార్పు అయితే కనిపించలేదని స్పష్టంగా తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, ప్రస్తుతం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి జయ చంద్రారెడ్డి మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో పాటు పార్టీకి నష్టం కలిగించే విధంగా వీరు వ్యవహరిస్తుండడంతో సీనియర్ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఏదైనా చెప్పినా పార్టీ అధినేత తో మేము మాట్లాడుతామంటూ జయ చంద్రా రెడ్డి వర్గీయులు చెబుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ తన ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. గత రెండు నెలల కిందట కూడా ఇరుపాక్షాల మధ్య తీవ్ర వివాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో సీఎం చంద్రబాబు పరోక్షంగా వారిని హెచ్చరించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తున్నారా తన్నుకుంటున్నారా అంటూ తీవ్రంగానే ప్రశ్నించారు. అయినా వారిలో మార్పు రాకపోగా మరింత వివాదాల దిశగా తమ్ముళ్లు పరుగులు పెడుతున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గీలపై జయ చంద్రారెడ్డి వర్గీయులు దాడి చేశారు. దీంతో నియోజకవర్గంలో టిడిపి రాజకీయాలు చాలా వేడెక్కాయి. ఒకరికి- ఒకరికి పడకపోవడం, ఒకరిపై ఒకరు వివాదాలు వచ్చేలా వ్యవహరించడం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం అధినేత ఆదేశాలను సైతం పట్టించుకోకపోవడంతో సీనియర్ నాయకులు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే అన్ని సర్దుకుంటాయని త్వరలోనే చిత్తూరులో పర్యటిస్తానని ఇటీవల చంద్రబాబు సీనియర్ నాయకులకు సమాచారం అందించారు. కానీ, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు మరింత చేజారే అవకాశం ఉందన్నది సీనియర్ నాయకులు చెబుతున్న మాట. మరోవైపు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చంద్రబాబు చెబుతున్నప్పటికీ అటు శంకర్ యాదవ్ వర్గం కానీ ఇటు జయ చంద్రా రెడ్డి వర్గం కానీ కనీసం పట్టించుకోకుండా వ్యవహరించడం మరింత వివాదంగా మారుతోంది. విభేదాలు ఉండొచ్చు లేదా వ్యక్తిగత రాజకీయ కక్షలు ఉండొచ్చు కానీ పార్టీ పరంగా వారు ఈ విధంగా వ్యవహరించడంతో ఇబ్బందులు కొనితెచ్చుకున్నట్టు అవుతోందన్నది సీనియర్ నాయకులు చెబుతున్న మాట. ఇప్పటికైనా నాయకుల పనితీరు మారాలని పార్టీకి ప్రయోజనం కరంగా ఉండే విధంగా వ్యవహరించాలని సీనియర్లు సూచిస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జెలెన్ స్కీ సూట్ పై ట్రంప్ చమత్కారాలు.. నవ్వులు పూయించాయి



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీల మధ్య జరిగిన తాజా భేటీ ఆసక్తికరమైన పరిణామాలకు వేదికైంది. మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దారులు వెతికే క్రమంలో శ్వేతసౌధంలో వీరు సమావేశమయ్యారు. ఈ సమావేశం కేవలం గంభీరమైన చర్చలతోనే కాకుండా, హాస్యభరిత వాతావరణాన్ని కూడా సృష్టించింది.

**గత విమర్శ, నేటి ప్రశంస**

ఈ ఏడాది ఫిబ్రవరిలో జెలెన్స్కీ, ట్రంప్‌ల మధ్య వైట్‌హౌస్‌లో భేటీ జరిగినప్పుడు జెలెన్స్కీ సాధారణ టీషర్ట్‌తో వచ్చారు. ఆ సమయంలో అమెరికా మీడియా ప్రతినిధులు ఆయన డ్రెస్సింగ్‌పై విమర్శలు గుప్పించారు. కన్జర్వేటివ్ రిపోర్టర్ బ్రియాన్ గ్లెన్ నేరుగా "మీరు ఎందుకు సూట్ వేసుకోలేదు? ఇది అమెరికా అత్యున్నత కార్యాలయం. అసలు మీ వద్ద సూట్ ఉందా?" అంటూ వ్యాఖ్యానించారు. దీనికి జెలెన్స్కీ స్పందిస్తూ "యుద్ధం ముగిసిన తర్వాత తప్పకుండా సూట్ వేసుకుంటా" అని సమాధానమిచ్చారు.

**తాజా భేటీలో సూట్‌పై చమత్కారాలు**

తాజా సమావేశంలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఈసారి జెలెన్స్కీ శుభ్రమైన సూట్‌లో వచ్చారు. ఆయన దుస్తులపై ప్రశంసలు కురిసాయి. గతంలో విమర్శించిన రిపోర్టర్ బ్రియాన్ గ్లెన్నే ఈసారి "ఈ సూట్‌లో మీరు అద్భుతంగా కనిపిస్తున్నారు" అంటూ పొగిడారు.

ఇక్కడే ట్రంప్ జోక్యం చేసుకొని హాస్యం పండించారు. "గతంలో మీపై మాటలతో 'అటాక్' చేసింది కూడా ఈ విలేఖరేనండోయ్" అంటూ జెలెన్స్కీకి గుర్తు చేశారు. దీనికి జెలెన్స్కీ నవ్వుతూ "అవును, నాకు గుర్తుంది. కానీ మీరు మాత్రం అదే సూట్‌లో ఉన్నారు, నేను మాత్రం కొత్తదాన్ని వేసుకున్నాను" అని గ్లెన్‌ను ఉద్దేశించి అన్నారు. దీనితో అక్కడి వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది.

**యుద్ధంపై సానుకూల సంకేతాలు**

ఈ హాస్యభరిత క్షణాల మధ్య ప్రధాన చర్చ మాత్రం యుద్ధం ముగింపు దిశగా సాగింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలకడానికి అవసరమైన చర్యలపై ఇద్దరు నాయకులు సానుకూల ప్రకటనలు చేశారు. ఈ సమావేశం ఒకవైపు శాంతి ప్రయత్నాలకు మార్గదర్శకంగా నిలిస్తే, మరోవైపు జెలెన్స్కీ సూట్‌పై జరిగిన చమత్కారాలు ట్రంప్-జెలెన్స్కీ మధ్య ఉన్న స్నేహపూర్వక వాతావరణాన్ని ప్రతిబింబించాయి.

# విశాఖ ఉక్కు-వైసీపీ హక్కా.. అదెలా ..!




**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ స్టీల్ ప్లాంట్ కి సంబంధించి కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, స్థానికంగా విశాఖ స్టీల్ యాజమా న్యం తీసుకుంటున్న నిర్ణయాలు కార్మికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పెద్ద ఎత్తున ఉద్యమాలకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇప్పటికే 2 ఏళ్లకు పైగా ఇక్కడ కార్మికులు ఉద్యోగులు ఆందోళన నిర్వహిస్తు న్నారు. దీనికి గతంలో కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ చీఫ్ షర్మిల నిరాహార దీక్షకు దిగడం, ఆమెను పోలీసులు అడ్డుకోవడం కూడా జరిగాయి. ఇక ఇప్పుడు ఈ ఉద్యమాన్ని తాము ముందుకు తీసుకువెళ్తామంటూ వైసీపీ నాయకులు తరమీదకు వచ్చారు. రెండు రోజుల కిందట విశాఖ ఉక్కు యాజమాన్యం ఏకంగా ఒకేసారి 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. విశాఖ ఉక్కు కర్మాగారం లోని కీలకమైన విభాగాల్లో మైనింగ్, అదేవిధంగా ఇతర విభాగాలను కూడా ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై ఉద్యోగులు మరింత ఆగ్రహం తో రగిలిపోతున్నారు. ఇప్పటికే చాలా వాటిని ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేశారని, ఇప్పుడు 34 కీలక విభాగాలను కూడా ప్రైవేటీకరించడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వైసిపి దీనిని అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. వైసిపి మాజీ ఎంపీ ఒకరు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కార్మికులకు తమ అండగా నిలబడతామని ఉద్య మాన్ని తీవ్రతరం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్ పై ఉద్యోగ సంఘాలు, కార్మికులు సదరు మాజీ ఎంపీని కలిసినప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. అయితే ఇది ఆయన వ్యక్తిగతమా లేక పార్టీ పరంగా తీసుకుని నిర్ణయిమా అంటే పార్టీ పరంగానే నిర్ణయం తీసుకుంటామని చెప్పడం మరో విశేషం. నిజానికి వైసిపి హయాంలోనే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రవేటీరణకు సంబంధించిన అడుగులు పడ్డాయి. అప్పట్లో ఉద్యమాలను వ్యతిరేకించిన నాయకులు ఇప్పుడు ఉద్యమాలకు సిద్ధమవుటం రాజకీయంగా ఆసక్తిగా మారింది. అంతేకాదు అప్పట్లో జగన్ కేవలం లేఖలు రాసి ప్రైవేటీకరణ కాకుండా చూడండి అని సుతిమెత్తని మాటలతో సరిపెట్టారు. కానీ, ఇప్పుడు ఏకంగా ఉక్కు ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నామ ని ప్రకటించటం వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయన్నది స్థానికంగా జరుగుతున్న చర్చ. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు విషయాన్ని వైసిపి భుజాన వేసుకుంటుందా అనేది ఆసక్తిగా మారింది. ఒకప్పుడు కాదని, ఇప్పుడు వద్దని చెబుతుండడం వెనక కచ్చితంగా రాజకీయ ప్రయోజనాలు ఉంటాయ న్నది రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగులకు మద్దతు ఇవ్వడం లేదా విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడం వరకు తప్పు లేదని, కానీ దీనిని రాజకీయ కోణంలో చూడడం ద్వారా ఎవరికీ ప్రయోజనం ఉండదని వారు చెబుతున్నారు.

ప్రస్తుతం దీనిపై వైసీపీ అధికారి కంగా ఎలాంటి ప్రకటన చేయకపోయినా మాజీ ఎంపీ చేసిన వ్యాఖ్యలను బట్టి, పార్టీలో ఆయనకు ఉన్న స్థాయిని బట్టి చూస్తే ఖచ్చితంగా విశాఖ ఉక్కును రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకునేందు కు వైసిపి సిద్ధపడుతోందన్నది కనిపిస్తోంది. మరి భవిష్యత్తులో ఏం జరుగుతుంది? ఇది ఏ మేరకు ఆ పార్టీకి మేలు చేస్తుంది? అదే సమయంలో నిజంగానే విశాఖ ఉక్కుపై వైసీపీ ప్రేమతోనే ఉద్యమాలకు సిద్ధమవుతోందా? అనేది చూడాలి.

## చివరి 7 మ్యాచ్‌ల్లో 67 పరుగులు.. ఆసియా కప్‌కు గోల్డెన్ ఛాన్స్ అంటే ఇతనిదే



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ఫినిషర్ గా పేరు తెచ్చుకున్న రింకూ సింగ్ కు ఆసియా కప్ లో చోటు దక్కించుకున్నాడు. పేలవ ఫామ్ లో ఉన్న రింకుకి చోటు దక్కడం కాస్త ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే రింకూ టీ20 రికార్డ్ ఏడాది నుంచి ఘోరంగా ఉంది. ఫినిషర్ గా రింకూకు సెలక్టర్లు మరొక అవకాశాన్ని ఇచ్చినట్టు తెలుస్తోంది. అయ్యర్, జైశ్వాల్ సూపర్ ఫామ్ లో ఉన్న వీరికి దక్కని అవకాశం ఈ ఉత్తర ప్రదేశ్ ఆటగాడికి దక్కింది. 2023 ఐపీఎల్ సీజన్ లో రింకూ సింగ్ ఒక్కసారిగా స్టార్ ఆటగాడి లిస్టులోకి చేరాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో వరుసగా ఐదు సిక్స్‌లు కొట్టి కోల్‌కతా జట్టును గెలిపించి ఒక్కసారిగా వైరల్‌గా మారిపోయాడు.

ఈ ప్రదర్శనతో అనూహ్యంగా టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చి తనకు తాను నిరూపించుకున్నాడు. నిలకడగా ఆడుతూనే వేగంగా పరుగులు చేస్తూ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ లో కోల్ కతా నైట్ రైడర్స్ జట్టు తరపున ఎన్నో మ్యాచ్ లు గెలిపించిన రింకూ.. భారత జట్టులోనూ అంతే నిలకడగా రాణించాడు. ఇండియా తరపున తొలి 19 ఇన్నింగ్స్ ల్లో 59.87 సగటు..175.45 అద్భుతమైన స్ట్రైక్‌రేట్‌తో 479 పరుగులు చేశాడు. వీటిలో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే 2024 నుంచి రింకూ కెరీర్ ఒక్కసారిగా దిగజారిపోయింది. ఒకవైపు ఐపీఎల్ లో ఘోరంగా విఫలం కావడంతో పాటు మరోవైపు భారత జట్టులోనూ తన పేలవ ఫామ్ ను కొనసాగించాడు.

రింకూ సింగ్ చివరి 7 టీ20 మ్యాచ్ లు చూసుకుంటే 13.40 సగటుతో కేవలం 67 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అతని స్ట్రైక్ రేట్ (101.51) కూడా దారుణంగా ఉంది. సౌతాఫ్రికా టూర్ లో 9.33 సగటుతో 28 పరుగులు మాత్రమే చేశాడు. వరుసగా తుది జట్టులో అవకాశాలిస్తున్నా ఉపయోగించుకోలేకపోయాడు. ఐపీఎల్ ప్రదర్శన చూసుకున్నా దారుణంగా ఉంది. చివరి రెండు సీజన్ లలో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. 2024లో 18.66 సగటుతో 168 పరుగులు మాత్రమే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్ లో 29.42 యావరేజ్ తో కేవలం 206 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. ఆసియా కప్ రింకూకు చివరి ఛాన్స్. ఈ టోర్నీలో రింకూ నిరూపించుకోకపోతే అతని టీ20 కెరీర్ ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

## అయ్యర్, జైశ్వాల్‌తో పాటు మరో నలుగురు స్టార్ క్రికెటర్లపై వేటు.. కారణమిదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ కోసం ప్రకటించిన భారత స్క్వాడ్ లో సెలక్టర్లు ఎలాంటి ప్రయోగాలు చేయలేదు. ఫామ్ లో ఉండి నిలకడగా రాణించిన 15 మందిని ఎంపిక చేశారు. మంగళవారం (ఆగస్టు19)సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన 15 మంది జట్టులో దాదాపు యంగ్ క్రికెటర్లకే చోటు కల్పించారు. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఈ టోర్నీ జరగబోతుంది. ఈ కాంటినెంటల్ టోర్నీకి మరో 20 రోజుల సమయం ఉంది. 2026లో జరగబోయే టీ20 వరల్డ్ కప్ ను దృష్టిలో పెట్టుకొని ఈ జట్టును ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 15 మంది జాబితాలో శ్రేయాస్ అయ్యర్ తో పాటు, యశస్వి జైశ్వాల్, వాషింగ్ టన్ సుందర్ లకు దురదృష్టవశాత్తు చోటు దక్కలేదు. వీరితో పాటు కొంతమంది స్టార్ క్రికెటర్లను సెలక్టర్లు పక్కన పెట్టారు. వారెవరో ఇప్పుడు చూద్దాం.

**రిషబ్ పంత్:**

ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ లో గాయపడిన పంత్ సర్జరీ నుంచి తప్పించుకున్నాడు. మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టులో గాయపడిన రిషబ్.. ఓవల్ లో జరిగిన ఐదో టెస్టుకు దూరమయ్యాడు. కాలికి తీవ్ర గాయం కావడంతో మొదట సర్జరీ అవసరమని భావించినా.. ఆ తర్వాత ఆ అవసరం లేదని డాక్టర్లు కన్ఫర్మ్ చేశారు. గాయపడిన పంత్ కు 6 వారాల రెస్ట్ అవసరమని వైద్యులు సూచించారు. దీంతో పంత్ సెప్టెంబర్ లో జరగబోయే ఆసియా కప్ కు దూరమయ్యాడు. ఒకవేళ పంత్ ఫిట్ గా ఉండి ఉంటే జితేష్ శర్మ స్థానంలో చోటు సంపాదించేవాడు.

**కేఎల్ రాహుల్:**

భారత వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఆసియా కప్ కు సెలక్ట్ కాలేదు. కుర్రాళ్లతో పోటీ కారణంగా రాహుల్ కు జట్టులో అవకాశం దక్కనట్టు స్పష్టంగా తెలుస్తోంది. ప్రస్తుతం యంగ్ టీమిండియా టీ20ల్లో అదరగొడుతుంది. అనుభవజ్ఞుడైన రాహుల్ లేకపోయినా ఆ ప్రభావం జట్టుపై పడే అవకాశం లేదు. వికెట్ కీపర్ గా సంజు శాంసన్ తొలి ఆప్షన్ కాగా.. జితేష్ శర్మ బ్యాకప్ కీపర్ గా ఎంపికయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్ లో రాహుల్ అద్భుతంగా రాణించినా అనుభవం కంటే సెలక్టర్లు కుర్రాళ్లకు ఎక్కువగా అవకాశాలు ఇస్తున్నారు.

**మహమ్మద్ సిరాజ్:**

హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ కు సైతం ఆసియా కప్ లో చోటు దక్కించుకోలేకపోయాడు. స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఆసియా కప్ కు అందుబాటులో ఉన్నాడు. బుమ్రాతో పాటు టీ20 స్పెషలిస్ట్ అర్షదీప్ సింగ్ జట్టులో తుది జట్టులో ఉండడం ఖాయం. వీరికి బ్యాకప్ గా యంగ్ పేసర్ హర్షిత్ రాణా స్క్వాడ్ లో చోటు దక్కింది. ఇటీవలే ముగిసిన ఇంగ్లాండ్ సిరీస్ లో సిరాజ్ అద్భుతంగా రాణించి టాప్ వికెట్ టేకర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఏడాది కాలంగా భారత టీ20 జట్టులో సిరాజ్ కొనసాగకపోవడం మైనస్ గా మారింది. ఈ ఏడాది ప్రారంభంలో ఛాంపియన్స్ ట్రోఫీలో చోటు దక్కించుకోలేకపోయిన సిరాజ్ కు మరోసారి నిరాశే ఎదురైంది.

**మహమ్మద్ షమీ:**

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ ఆసియా కప్ లాంటి మెగా టోర్నీకి సెలక్ట్ అవుతాడని భావించినా అది జరగలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బుమ్రా లేకపోవడంతో షమీని ఎంపిక చేశారు. ఈ టోర్నీలో 5 మ్యాచ్‌ల్లో 9 వికెట్లు పడగొట్టి పర్వాలేదనిపించాడు. అయితే వన్డే ఫార్మాట్ కావడం.. బుమ్రా కూడా లేకపోవడంతో షమీకి ఛాన్స్ దక్కింది. ప్రస్తుతం టీ20 ఫార్మాట్ లో షమీని నమ్ముకునే పరిస్థితిలో భారత యాజమాన్యం లేనట్టు తెలుస్తోంది. అతని ఫిట్ నెస్ తో పాటు వయసు పొట్టి ఫార్మాట్ కు సహకరించడం కష్టం. 2025లో షమీ భారతదేశం తరపున 2 టీ20 మ్యాచ్ లు ఆడాడు. 5.3 ఓవర్లు బౌలింగ్ చేసి 9.43 ఎకానమీతో 3 వికెట్లు పడగొట్టాడు.

## నాని బాక్సాఫీస్.. ఇప్పటికే 400 కోట్లు ఉందంటే..



ఆషికా రంగనాథ్‌తో సింప్లిసిటీ దాని బెస్ట్



టాలీవుడ్‌లో మీడియం రేంజ్ హీరోల మధ్య కఠినమైన పోటీ నడుస్తున్న సమయంలో నాని మాత్రం తన ప్రత్యేకమైన స్థాయిని సాధించుకున్నాడు. వరుసగా సినిమాలు చేస్తూ, విభిన్న కథలను ఎంచుకుంటూ, బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు సాధించడంలో నాని ఎప్పుడూ ముందుంటున్నాడు. డిసాస్టర్ అయిన కొన్ని సినిమాల తర్వాత కూడా ఆయన తన క్రేజ్‌ను కొనసాగించడం విశేషం.

ఇటీవల నాని చేసిన నాలుగు సినిమాలు కలిపి ఏకంగా 400 కోట్ల గ్రాస్ వసూలు చేశాయి. దసరా, హాయ్ నాన్న, సరిపోదా శనివారం, హిట్ 3 సినిమాలు కలిపి ఈ అద్భుతమైన రికార్డును సాధించాయి. దాంతో మీడియం రేంజ్ హీరోల్లో నానిని అందుకోవడం మిగతావారికి సాధ్యం కావడం లేదు.

**బ్లాక్‌బస్టర్ల లెక్కలు**

దసరా సినిమా 115 కోట్ల గ్రాస్ వసూలు చేయగా, హాయ్ నాన్న 74 కోట్ల మార్క్ చేరింది. ఆ తర్వాత సరిపోదా శనివారం 100 కోట్ల గ్రాస్‌తో నానిని మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. తాజాగా హిట్ 3 సినిమా 111 కోట్ల గ్రాస్ సాధించింది. ఈ నాలుగు సినిమాల కలిపి లెక్క 400 కోట్లకు పైగా వెళ్లి నానిని మీడియం రేంజ్ హీరోల్లో లీడర్‌గా నిలిపింది.

**అతిపెద్ద బడ్జెట్ మూవీ ప్యారడైజ్**

ఇక ఇప్పుడు నాని తన కెరీర్‌లోనే అతిపెద్ద బడ్జెట్ మూవీ 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నాడు. సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. జడల్ అనే పాత్రలో నాని నెవ్వర్ బిఫోర్ లుక్‌లో కనబడబోతుండటంతో ఫ్యాన్స్‌లో భారీ హైప్ క్రియేట్ అయింది.

**ఇండస్ట్రీలో టాక్ ఏమిటంటే**

ప్యారడైజ్ సినిమాతో నాని కనీసం 200 కోట్ల గ్రాస్ మార్క్‌ను ఈజీగా చేరుకుంటాడని ఇండస్ట్రీలో బలమైన టాక్ వినిపిస్తోంది. సినిమాకు కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటే 300 కోట్ల వరకు కూడా వెళ్లే ఛాన్స్ ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఎనిమిది భాషల్లో రిలీజ్ అవ్వడం వలన ప్యారడైజ్ పాన్ ఇండియా లెవెల్‌లో మంచి బాక్సాఫీస్ రేంజ్ చూపిస్తుందని అంచనా. ఇప్పటి వరకూ సాధించిన 400 కోట్ల మార్క్‌తో పాటు, రాబోయే ప్యారడైజ్ విజయం సాధిస్తే నాని రేంజ్ మరో లెవెల్ కు వెళ్తుందని చెప్పవచ్చు. మీడియం రేంజ్ హీరోలలో మాత్రమే కాకుండా, టాప్ స్టార్ల సరసన కూడా నిలిచే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి.



తాజా పసుపు నేపథ్య స్నాప్‌లలో ప్రగ్యా నయన్ అబ్బురపరుస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com